జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం | 25 | ఆగస్టు | 2026 ♦ పేజీలు : 8



# పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేసి సత్వర పరిష్కారం చూపాలి


- జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



**బూర్గంపహాడ్, ఆగస్టు 24 (ప్రజా జ్యోతి):** పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయడంతో పాటు సత్వర పరిష్కారం చూపాలని జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు అన్నారు. సోమవారం బూర్గంపహాడ్ పోలీస్ స్టేషన్‌కు ఆయన వార్షిక

మిగతా 2 లో...

# వన మహోత్సవ లక్ష్యాలను సెప్టెంబర్ చివరి నాటికి పూర్తి చేయాలి



- వన మహోత్సవ కార్యక్రమంలో ప్రజలను పెద్ద ఎత్తున భాగస్వాములు చేయాలి
- రేపు జిల్లావ్యాప్తంగా భారీగా సామూహిక మొక్కలు నాటాలి
- రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

**కొత్తగూడెం కలెక్టరేట్ ఆగస్టు 24 ప్రజా జ్యోతి** వన మహోత్సవంలో భాగంగా జిల్లాలకు నిర్దేశించిన మొక్కలు నాటే లక్ష్యాలను సెప్టెంబర్ చివరి నాటికి పూర్తి చేసేలా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం వన మహోత్సవ కార్యక్రమంపై అన్ని జిల్లాల కలెక్టర్లతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఐడీఓసీ కార్యాలయం నుంచి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 16.06 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించగా, ఇప్పటివరకు 9.06 కోట్ల మొక్కలు నాటినట్లు తెలిపారు. రేపు అన్ని జిల్లాల్లో భారీ స్థాయిలో సామూహిక మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహించి, ప్రజలను పెద్ద ఎత్తున భాగస్వామ్యం

మిగతా 2 లో...




2 లో..

# ఇండస్ట్రియల్ భూముల్లో.. నిబంధనలకు తూట్లు!

- జిల్లాలో ఇండస్ట్రియల్ భూములకు 1973 లో వేసిన పునాది..
- కొత్తగూడెం.. భద్రాచలం.. పాల్వంచలో 1085 ఎకరాల్లో కేటాయింపులు
- మొత్తంగా 151 ప్లాట్ల ఏర్పాటు.. అందులో 146 కేటాయింపు
- నేడు ఆధ్వానంగా మారిన పారిశ్రామిక వాడల తీరు
- చాల చోట్ల ఏళ్లుగా మూతపడిన వైనం
- పరిశ్రమలు లేకుండా.. సొంత అవసరాలకు వినియోగం
- కేటాయింపుల నిబంధనలకు తిలోదాకలు
- ఏజెన్సీ ప్రాంతాల్లో.. 1/70తో మరిన్ని ఆంక్షలు
- ప్రభుత్వ సబ్సిడీలు పొంది దర్జాగా చలామణి అవుతున్న యజమానులు
- ఉదాహరణగా కిన్నెర ప్రాంగణంలో.. రూట్‌వెల్ అక్రమ కార్యకలాపాలు
- నిబంధనలు ఉన్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితి ఏంటి?

# రచ్చబండతో గ్రామాల సమస్యలకు పరిష్కారం

- ఎమ్మెల్యే జారే ఆదినారాయణ
- రూ.6.89 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే



**ములకలపల్లి, ఆగస్టు 24 (ప్రజా జ్యోతి):** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నియోజకవర్గంలోని 102 గ్రామ పంచాయతీల్లో దశలవారీగా రచ్చబండ కార్యక్రమాలు నిర్వహిస్తామని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ములకలపల్లి మండలంలోని మారుమూల గుండాలపాడు గ్రామ పంచాయతీలో సోమవారం మండల అధికారులతో కలిసి రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా గుండాలపాడు టు తిమ్మంపేట కు రూ.6 కోట్ల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. రూ.20 లక్షలతో నిర్మించిన పంచాయతీ భవనాన్ని, రూ.12 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అనంతరం స్థానిక సర్పంచ్ కారం వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో గ్రామస్థుల నుంచి సమస్యలను తెలుసుకున్నారు. పోడు భూములు, తాగునీరు,

మిగతా 2 లో...

# పసిడి పైరు... 'పామాయిల్' సీమ!

- తెలంగాణ ఆయిల్ పామ్ పురిటిగడ్డ 'అశ్వారావుపేట'
- నెలనెలా ఖచ్చితమైన ఆదాయం... అంతర పంటలతో ద్విగుణీకృత లాభాలు



**అశ్వారావుపేట (ప్రజా జ్యోతి) ఆగస్టు 23** పచ్చటి ఆకుల విడతలతో కనుచూపు మేర పరిచిన తివాచీలు, వరుసగా అమర్చిన పాలిథిన్ బ్యాగుల్లో చిగురిస్తున్న చిన్నారి మొక్కలు, వాటి పక్కనే శబ్దాలు చేస్తూ క్రూడ్ ఆయిల్ రసం తీసే భారీ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీలు... అశ్వారావుపేట, దమ్మపేట ప్రాంతాల్లో అడుగుపెట్టగానే పలకరించే దృశ్యమిది. తెలంగాణ సీమలో రూపుదిద్దుకున్న ఆయిల్ పామ్ విప్లవానికి ఈ ప్రాంతం అసలైన పురిటిగడ్డగా నిలిచింది. ఇక్కడి విత్తన నర్సరీల నుంచి ప్రారంభమయ్యే పసిడి ప్రయాణం, పొలాల్లో చెట్లయి, అశ్వారావుపేట, దమ్మపేటల్లోని భారీ ఆయిల్ ఫ్యాక్టరీల్లో ప్రాసెస్ అయి రైతుల ఇళ్లలో సిరుల పంట పండిస్తోంది మలేషియా, కోస్టారికా వంటి

మిగతా 2 లో...

## రచ్చబండతో గ్రామాల సమస్యలకు పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి...)

డ్రైనేజీ, రహదారులు, విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల మంజూరు తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామస్థాయిలోనే ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు రచ్చబండ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. అధికారులను ప్రజల వద్దకు తీసుకెళ్లి, అక్కడికక్కడే పరిష్కరించగల సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని చెప్పారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, నియోజకవర్గంలో తాటాకు ఇల్లు లేని పరిస్థితి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయిస్తామని చెప్పారు. రాష్ట్రంలోనే అత్యధికంగా ఇందిరమ్మ ఇళ్లు అశ్వారావుపేట నియోజకవర్గానికి మంజూరయ్యాయని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం తిమ్మంపేటలో ప్రాథమిక పాఠశాల కాంపౌండ్‌వాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పొగళ్లపల్లిలో పాఠశాలలు, సబ్ సెంటర్‌కు సంబంధించిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. చౌటిగూడెంలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ స్వాతి బిందు, ఎంపీడీఓ సత్యనారాయణ, ఎంపీఓ రమేష్, విద్యుత్ శాఖ ఏఈ నరేష్, ఐటీడీఏ సుబ్బరాజు, హౌసింగ్ ఏఈ శ్రీధర్, ఎఫ్ఆర్ఓ సులోచన, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వరప్రసాద్, సర్పంచులు కారం వెంకటేష్, మడకం రవి, తుర్రం శ్రీను, తానం పద్మ, కల్లూరి కిషోర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జహీర్, తాండ్ర ప్రభాకర్, పేటేటి నరసింహారావు, గాడి తిరుపతిరెడ్డి, కారం సుధీర్, మండల అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు

## పసిడి పైరు... 'పామాయిల్' సీమ!



(మొదటి పేజీ తరువాయి...)

సుదూర దేశాల నుంచి సేకరించిన మేలైన విత్తనాలతో అశ్వారాపేట నర్సరీలలో ఈ అద్భుత ప్రయాణం మొదలవుతుంది. తెలంగాణ ఆయిల్ ఫెడ్, ఉద్యాన పరిశోధనా స్థానాల పర్యవేక్షణలో ప్రతీ విత్తనాన్ని ఒక పసిపాపలా సంరక్షిస్తారు. డ్రిప్ విధానంలో కొలతల ప్రకారం అందించే నీరు, క్రమబద్ధమైన పోషకాలతో 10 నుంచి 12 నెలల పాటు అత్యంత అప్రమత్తంగా పెంచిన ఈ మొక్కలు, అత్యధిక ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్ రేటు సాధించే సామర్థ్యంతో రైతుల చేతుల్లోకి వెళ్తాయి నర్సరీల నుంచి రైతుల పొలాల్లోకి వెళ్లిన ఈ మొక్కలు నాలుగేళ్లలో చెట్లయి భారీ గెలలను అందిస్తాయి. అయితే పంట పండిన తర్వాత 'ఎక్కడ అమ్మాలి?' అనే దిగులు ఇక్కడి రైతుకు ఏమాత్రం ఉండదు. అశ్వారాపేట, దమ్మపేటలలో అందుబాటులో ఉన్న తెలంగాణ ఆయిల్ ఫెడ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీలే ఇందుకు ప్రధాన కారణం. తోటల్లో కోసిన పచ్చి గెలలను నేరుగా ఈ ఫ్యాక్టరీలకు తరలిస్తారు మధ్యవర్తుల ప్రమేయం లేకుండా, టన్నుల కొద్దీ గెలలను కొనుగోలు చేసి, కొన్ని గంటల్లోనే నూనెను వేరుచేసే అత్యాధునిక సాంకేతికత ఇక్కడ ఉంది. ప్రభుత్వ మద్దతు ధరతో నేరుగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమకావడం వల్ల ఇక్కడి రైతులకు మార్కెట్‌లో మోసపోయే అవకాశమే లేదు ఈ సమగ్ర వ్యవస్థ వల్ల ఇక్కడి రైతుల జీవనచిత్రం పూర్తిగా మారిపోయింది. ఒకప్పుడు వాతావరణ మార్పులతో, అప్పుల బాధలతో సతమతమైన రైతాంగానికి ఆయిల్ పామ్ ఒక ధీమానిచ్చింది. ప్రతీ 15 రోజులకు ఒకసారి జరిగే గెలల కోత వల్ల రైతులకు ఉద్యోగుల్లా "నెలవారీ స్థిర ఆదాయం" సమకూరుతోంది. దానికితోడు పామాయిల్ తోటల నీడలో పెరిగే చాక్లెట్ పంట 'కోకో' వంటి అంతర పంటల సాగుతో ఒకే భూమి నుంచి ద్విగుణీకృత లాభాలు పొందుతున్నారు. ఒకసారి తోట నాటితే దాదాపు 25 నుండి 30 సంవత్సరాల పాటు నిశ్చింతగా రాబడి పొందవచ్చుననే నమ్మకం ఇక్కడి రైతుల్లో కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. విత్తనం నాటిన నర్సరీ మడుల నుంచి, పంటను ప్రాసెస్ చేసే దమ్మపేట, అశ్వారాపేట ఫ్యాక్టరీల వరకు ఏర్పడిన ఈ బలమైన శృంఖలమే (Supply Chain) రైతుల ఆర్థిక ప్రగతికి అసలైన రహస్యం. విదేశీ నూనెల దిగుమతి భారాన్ని తగ్గిస్తూ, స్వదేశీ రైతుకు ఆర్థిక స్వావలంబన అందించే దిశగా అశ్వారాపేట–దమ్మపేట నమూనా నేడు దేశానికే ఒక రోల్ మోడల్‌గా నిలుస్తోంది..

# ఇండస్ట్రియల్ భూముల్లో.. నిబంధనలకు తూట్లు!

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ఆగస్టు 24, ప్రజాజ్యోతి:** పరిశ్రమ ఏర్పాటు కోసం భూమి తీసుకోవడం.. ప్రభుత్వ రాయితీలు, సబ్సిడీలు పొందడం.. కొన్నేళ్లు పరిశ్రమ నడపడం.. ఆ తర్వాత మూసేయడం.. ఏళ్ల తరబడి కార్యకలాపాలు లేకపోయినా ప్రాంగణాన్ని అలాగే ఉంచడం.. చివరకు అదే ప్రాంగణంలో మరో సంస్థ కార్యకలాపాలు సాగించడం..! భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పాత పారిశ్రామిక వాడల పరిస్థితిని పరిశీలిస్తే ఇలాంటి అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. పరిశ్రమల అభివృద్ధి, పెట్టుబడులు, స్థానిక యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో కేటాయించిన భూములు ప్రస్తుతం అదే లక్ష్యానికి ఉపయోగపడుతున్నాయా.. లేక కాలక్రమంలో ఇతరుల అవసరాలకు వినియోగంలోకి వచ్చాయా అన్నది ఇప్పుడు కీలకంగా మారింది.

**ఈ ఉద్దేశంతోనే.. నాడే పారిశ్రామిక అడుగులు**

పారిశ్రామిక అభివృద్ధి కోసం 1973లో అప్పటి ఉమ్మడి రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏపీఐఐసీ) ఏర్పాటైంది. పరిశ్రమలకు భూములు, మౌలిక వసతులు కల్పించి పారిశ్రామిక ప్రాంతాలను అభివృద్ధి చేయడమే దీని ప్రధాన ఉద్దేశం. ఇందులో భాగంగా కొత్తగూడెం, పాల్వంచ, భద్రాచలం ప్రాంతాల్లో పారిశ్రామిక వాడలను ఏర్పాటు చేశారు. కొత్తగూడెంలో 53.17 ఎకరాల్లో 50 ప్లాట్లు, భద్రాచలంలో 17.5 ఎకరాల్లో 41 ప్లాట్లు, పాల్వంచలో 1,013 ఎకరాల్లో సుమారు 42 ప్లాట్లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఉన్న ఎన్ఎండీసీ స్పాంజ్ ఐరన్ పరిశ్రమ కూడా ఈ పారిశ్రామిక వాడలోని భాగమే. వీటితో పాటు పాల్వంచలో మరో 1.29 ఎకరాల్లో 18 ప్లాట్లతో మినీ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌ను ఏర్పాటు చేశారు. మొత్తంగా 1085 ఎకరాలలో 151 ప్లాట్లను ఏర్పాటు చెయ్యగా అందులో 146 ప్లాట్లను కేటాయించారు. అయితే పాల్వంచతో పోలిస్తే కొత్తగూడెం, భద్రాచలం ప్రాంతాల పరిస్థితి భిన్నంగా ఉంది. ఈ రెండు ప్రాంతాలు ఏజెన్సీ పరిధిలో ఉండటంతో ఇక్కడ 1/70 నిబంధనలు కీలకంగా మారాయి. దీంతో పరిశ్రమల కోసం కేటాయించిన భూములను ఇతరులకు బదలాయించడం, అమ్మడం, ఒప్పందాలు చేసుకోవడంపై ఆంక్షలు ఉండటంతో గిరిజనేతరులకు కేటాయించిన కొన్ని భూములకు పూర్తి స్థాయిలో సేల్ డీడ్లు అమలు కాని పరిస్థితులు ఏర్పడ్డాయి.

**కేటాయింపులు భారీగా.. పరిశ్రమల పరిస్థితి అధ్వానంగా**

జిల్లాలో పరిశ్రమల అభివృద్ధి కోసం 70, 80, 90 దశకాలలో సుమారు 1,085 ఎకరాల్లో 146 ప్లాట్లు ఏర్పాటు చేసి కేటాయింపులు చేపట్టారు. ఒకప్పుడు ఈ భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉత్పత్తి పెంచడం, పెట్టుబడులు తీసుకురావడం, స్థానికులకు ఉపాధి కల్పించడం లక్ష్యంగా ఉండేది. కానీ కాలక్రమంలో పరిస్థితి మారిపోయింది. కేటాయించిన ప్లాట్లలో కొన్ని పరిశ్రమలు మూతపడగా.. మరికొన్ని ఏళ్లుగా ఎలాంటి కార్యకలాపాలు లేకుండానే కొనసాగుతున్నాయి. ఇంకొన్ని చోట్ల ప్రాంగణాలు సొంత అవసరాలకు వినియోగంలో ఉండగా.. మరికొన్ని చోట్ల ఇతరులకు అక్రమంగా లీజుకు ఇచ్చే ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. దీంతో ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కు జిల్లలో ఇంత పెద్ద మొత్తంలో భూములు కేటాయించినా.. పరిశ్రమలు మాత్రం ఒక్కొక్కటిగా నిర్వీర్యమవుతున్న పరిస్థితి కనిపిస్తోంది. అయితే ఈ భూములపై చిన్న నిర్మాణం చేపట్టాలన్నా, ప్రాంగణంలో ఏదైనా మార్పు చేయాలన్నా సంబంధిత సంస్థ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాల్సినంతగా నిబంధనలు ఉన్నాయి. ఇంత కఠినమైన నిబంధనలతో పారిశ్రామిక భూములను పర్యవేక్షించాల్సిన టీఎస్ఐఐసీ సంస్థ పనిచేస్తున్న.. మూతపడిన పరిశ్రమలు, ఖాళీగా ఉన్న ప్రాంగణాలు, ఇతరుల వినియోగంలో ఉన్న స్థలాలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నదే ప్రధాన ప్రశ్నగా మారింది. దీంతో ఇకనైనా ఏళ్ల తరబడి పరిశ్రమలు నడవని, కేటాయింపు లక్ష్యానికి ఉపయోగపడని యూనిట్లను గుర్తించి నిబంధనల ప్రకారం కేటాయింపులు రద్దు చేసి భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటే.. వాటిని కొత్తగా పరిశ్రమలు ఏర్పాటు చేయాలనుకునే వారికి కేటాయించే అవకాశం ఉంటుంది. తద్వారా ఖాళీగా ఉన్న పారిశ్రామిక భూములకు మళ్లీ వినియోగం రావడంతో పాటు.. స్థానిక యువతకు కొత్త పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు ఏర్పడి పారిశ్రామిక అభివృద్ధికి మరింత ఊతం లభించే అవకాశం ఉంది.

### ఇదే పరిస్థితికి.. 'కిన్నెర – రూట్ వెల్' ఉదాహరణ!

చుంచుపల్లి పారిశ్రామిక వాడలోని కిన్నెర మార్బుల్స్ ప్రాంగణం వ్యవహారం ఈ మొత్తం పరిస్థితికి ఓ ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తోంది. 1990లో కిన్నెర మార్బుల్స్‌కు సంబంధించిన ప్లాట్ నంబర్ 17లోని 9,344 చదరపు మీటర్ల ప్రాంగణం కొంతకాలం పరిశ్రమ కార్యకలాపాలకు ఉపయోగపడిన తర్వాత 1995లో మూతపడినట్లు వివరాలు ఉన్నాయి. ఆ తర్వాత సుమారు 25 ఏళ్లపాటు కార్యకలాపాలు లేకపోయినా ప్రాంగణం కేటాయింపుదారుడి పరిధిలోనే కొనసాగినట్లు సమాచారం. అయితే ఇదే ప్రాంగణంలో ప్రస్తుతం రూట్ వెల్ ఆగ్రో వెట్ ప్రైవేట్ లిమిటెడ్ కార్యకలాపాలు సాగుతున్నట్లు అందుబాటులో ఉన్న అధికారిక సమాచారం సూచిస్తోంది. కిన్నెర నుంచి రూట్ వెల్ వినియోగంలోకి ప్రాంగణం ఎలా వచ్చింది.. ఇందుకు సంబంధించిన రెంటల్ ఒప్పందం, కేటాయింపు హక్కులు, అవసరమైన అనుమతుల పరిస్థితి ఏంటి అన్నది ఇప్పుడు కీలకంగా మారింది. ముఖ్యంగా 2023లో ప్రారంభమైన ఈ రూట్‌వెల్ సంస్థ 2026లో టీఎస్ఐఐసీని అనుమతి కోసం ఎందుకు ఆశ్రయించింది? అప్పటి ఖమ్మం జోనల్ కార్యాలయం నుంచి ఆ విజ్ఞప్తిపై ఎలాంటి నిర్ణయం వెలువడింది? అధికారిక కార్యకలాపాలకు ఇక్కడి ప్రాంగణంపై హక్కులు, అనుమతుల పరిస్థితి స్పష్టంగా లేకపోతే.. ఈ సంస్థకు ఇతర అనుమతులు ఎలా వచ్చాయి? కోట్ల రూపాయల బ్యాంకు రుణం ఎలా మంజూరైంది? ఈ రెండు కంపెనీల డైరెక్టర్లు ఎవరు? ఈ వ్యవహారంలో నిబంధనలు, అనుమతులు, సంబంధిత రికార్డుల మధ్య ఉన్న అసలు పరిస్థితి ఏంటి? అనే ప్రశ్నలకు సమాధానం రావాల్సి ఉంది. జిల్లాలో పారిశ్రామిక భూముల కేటాయింపులు, మూతపడిన పరిశ్రమలు, ఇతరుల వినియోగం, లీజు ఒప్పందాలపై సమగ్ర పరిశీలన జరిగితే ఇలాంటి వ్యవహారాలు ఇంకా ఎన్ని వెలుగులోకి వస్తాయన్నది ఇప్పుడు చూడాల్సి ఉంది.

## వన మహోత్సవ లక్ష్యాలను సెప్టెంబర్ చివరి నాటికి పూర్తి చేయాలి



(మొదటి పేజీ తరువాయి...)

చేయాలని సూచించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలు, రానున్న రోజుల్లో అనుకూల వాతావరణాన్ని సద్వినియోగం చేసుకొని విస్తృతంగా మొక్కలు నాటాలని తెలిపారు అంగన్‌వాడీ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులు, యువత, ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని సూచించారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని మంత్రి ఆదేశించారు. ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్ చేసి, మనుగడను పర్యవేక్షించాలని, అటవీ ప్రాంతాల్లో ఖాళీ భూములను గుర్తించి మొక్కలు నాటాలని, పట్టణ ప్రాంతాల్లో అర్బన్ ఫారెస్ట్రీని ప్రోత్సహించాలని అన్నారు. దేవాలయాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాల్లో ప్రణాళికాబద్ధంగా మొక్కలు నాటాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అదనపు కలెక్టర్ విద్యా చందన సంబంధిత అధికారులతో మాట్లాడుతూ.. వన మహోత్సవంలో అన్ని వర్గాల ప్రజలను పెద్ద సంఖ్యలో భాగస్వామ్యం చేసి, జిల్లాకు నిర్దేశించిన మొక్కలు నాటే లక్ష్యాలను వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు, ఈ సమావేశంలో అడిషనల్ డిఆర్డిఏ రవి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేసి సత్వర పరిష్కారం చూపాలి

(మొదటి పేజీ తరువాయి...)

తనిఖీ నిర్వహించారు. తొలుత ఎస్పీకి పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్ ఘన స్వాగతం పలికారు. స్టేషన్లో పనిచేస్తున్న సిబ్బంది నుంచి ఆయన గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాలు, వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ స్టేషన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వివిధ సమస్యలపై స్టేషన్ కు వచ్చిన బాధితులతో మర్యాదగా వ్యవహరించి సమస్యలకు పరిష్కారం చూపేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలన్నారు. స్టేషన్లో వివిధ వర్టికల్స్లో విధులు నిర్వహించే సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. స్టేషన్లో నమోదైన యూఐ కేసులు, గ్రేవ్ కేసులు, ప్రాపర్టీ కేసుల వివరాలు సమీక్షించి దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేసి ప్రతి కేసును నాణ్యతతో దర్యాప్తు చేసి సత్వర పరిష్కారం చూపాలన్నారు. నేరచరిత్ర కలిగిన వ్యక్తుల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని, స్టేషన్ రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. సీసీటీఎన్ఎస్ 2.0లో కేసుల వివరాలు సక్రమంగా నమోదుచేసి ఈ సాక్ష్య, నాట్రిడ్, గాండీవ వంటి ఆధునిక సాంకేతిక వ్యవస్థలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై నిరంతర నిఘా ఉంచి కఠినచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గంజాయి అక్రమ రవాణా, వినియోగాలపై ప్రత్యేక దృష్టి సారించి యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అధికారులు, సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకుని సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం అధికారులు, సిబ్బందితో కలిసి పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్, సీఐ సతీష్, ఎస్సైలు మేడా ప్రసాద్, నాగభిక్షం, రామ్మూర్తి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# డ్రైనేజీలపై అక్రమ నిర్మాణాలు

- -మెయిన్ రోడ్డుకు పాకిన నిర్మాణాల పరంపర
- -ఆమ్ బజార్ డ్రైనేజీలపై నిర్మాణాలలో చర్యలు తీసుకోకపోవటమే కారణమా
- -ఎవరు ఏమీ చేయలేరనే ధీమాలో వ్యాపారస్తులు
- -డ్రైనేజీ కనిపించకుండా నిర్మాణాలు చేసిన ఓ వ్యాపారి
- -అధికారుల పర్యవేక్షణ లేకపోవటమే వారికి అనుకూలంగా మారిందా
- -ఆమ్ బజార్ ను సాకుగా చూపించే ప్రయత్నమా!
- -పూర్తిస్థాయిలో ప్రక్షాళన జరగాల్సిందేనా!
- -చర్యలకు వెనుకాడితే మరెన్నో అక్రమ నిర్మాణాలు జరిగే అవకాశాలు?
- -అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారోనన్న ఉత్కంఠ!
- -ఇల్లందు ఆమ్ బజార్, మెయిన్ రోడ్డు డ్రైనేజీలపై నిర్మాణాలకు అడ్డుకట్ట పడేనా!
- -ఉన్నతాధికారులు జర దృష్టి సారించరూ!





**ఇల్లందు, ఆగస్టు 24 (ప్రజా జ్యోతి)** ఇల్లందు పట్టణంలోని ఆమ్ బజార్ ప్రాంతంలో డ్రైనేజీలపై అక్రమ నిర్మాణాలు పెరిగిపోతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలిగించేలా మెయిన్ రోడ్డును ఆనుకుని నిర్మాణాలు విస్తరిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. డ్రైనేజీలపై నిర్మాణాలు చేయడం వల్ల వర్షపు నీరు, మురుగు నీరు సక్రమంగా వెళ్లే పరిస్థితి లేకుండా పోతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఆమ్ బజార్ డ్రైనేజీలపై నిర్మాణాలు చేసినప్పటికీ సంబంధిత శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పైగా ఏదో మొక్కుబడిగా నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారనే ఆరోపణలు లేకపోలేదు. ఇంతలా ఆమ్ బజార్ లో డ్రైనేజీలపై దర్జాగా అక్రమంగా నిర్మాణాలు చేపట్టడం ప్రతి ఒక్కరి కండ్లకు కనిపిస్తుంది. కానీ సంబంధిత శాఖ అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడకపోవడం, ఇలాంటి చర్యలకు ముందుకు రాకపోవడం ఆ ప్రాంత వ్యాపారస్తులకు అనుకూలంగా మారిందనే అపవాదు ఉంది. ఆమ్ బజార్ లో డ్రైనేజీలపై నిర్మించిన అక్రమ కట్టడాలపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో, ప్రస్తుతం మెయిన్ రోడ్డులో సైతం డ్రైనేజీలపై నిర్మాణాలు ప్రారంభమయ్యాయని తెలుస్తుంది. ఇప్పటికైనా మున్సిపల్ శాఖ అధికారులు డ్రైనేజీలపై నిర్మాణాలను కట్టడి చేయకపోతే ఎక్కడపడితే అక్కడ ప్రాంతంతో సంబంధం లేకుండా డ్రైనేజీలపై దర్జాగా నిర్మాణాలు జరిగే అవకాశం లేకపోలేదు. ఈ డ్రైనేజీలపై నిర్మాణాల వల్ల చెత్త, మురుగునీరు పేరుకుపోయి వాటిని శుభ్రం చేసే పరిసితి ఉండదని, దీంతో ప్రజలకు అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

### » మెయిన్ రోడ్డుకు పాకుతున్న నిర్మాణాలు

ఆమ్ బజార్ పరిధిలో ఇప్పటికే డ్రైనేజీలపై నిర్మాణాలు ఉన్నప్పటికీ వాటిపై పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోకపోవడం వల్ల తాజాగా మరికొందరు వ్యాపారస్తులు అదే విధానాన్ని అనుసరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మెయిన్ రోడ్డుకు ఆనుకోని ఉన్న నిర్మాణాలను ముందుకు విస్తరిస్తూ డ్రైనేజీలను ఆక్రమిస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు.

### » చర్యలు లేకపోవడమే కారణమా?

గతంలో డ్రైనేజీలపై జరిగిన నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోకపోవడమే అక్రమ నిర్మాణదారులకు ధైర్యాన్ని ఇస్తుందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోరనే ధీమాతో కొందరు వ్యాపారస్తులు నిబంధనలను పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

### » డ్రైనేజీ కనిపించకుండా నిర్మాణం?

ఒక వ్యాపారి తన నిర్మాణాన్ని విస్తరించే క్రమంలో డ్రైనేజీ కనిపించకుండా చేసే స్థాయిలో నిర్మాణం చేపట్టినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో డ్రైనేజీ ఉన్న ప్రాంతం గుర్తించలేని పరిస్థితి ఏర్పడిందని, భవిష్యత్తులో మురుగు నీటి ప్రవాహానికి తీవ్ర ఆటంకం కలిగే ప్రమాదం ఉందని వారు అంటున్నారు.

### » అధికారుల పర్యవేక్షణ ఏదీ?

పట్టణంలో నిర్మాణాలు జరుగుతున్న సమయంలో సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాల్సి ఉన్నప్పటికీ, ఆమ్ బజార్ ప్రాంతంలో పర్యవేక్షణ కొరవడిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిర్మాణాలు పూర్తయిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే ముందుగానే అక్రమ నిర్మాణాలను గుర్తించి అడ్డుకోవాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

### » ఆమ్ బజార్ ను సాకుగా చూపుతున్నారా?

ఆమ్ బజార్ లో రద్దీ, వ్యాపార అవసరాలు, స్థలాభావం వంటి అంశాలను సాకుగా చూపుతూ కొందరు వ్యాపారస్తులు డ్రైనేజీలపై నిర్మాణాలు చేపడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. అయితే ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా ప్రభుత్వ స్థలాలు, డ్రైనేజీలు ఆక్రమించడం ఎంతవరకు సమంజసమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

### » పూర్తిస్థాయిలో ప్రక్షాళన అవసరం

ఆమ్ బజార్ నుంచి మెయిన్ రోడ్డు వరకు డ్రైనేజీలను అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించి, ఆక్రమణలు ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. డ్రైనేజీలపై ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించి, మురుగు నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

### » చర్యలు లేకుంటే మరిన్ని అక్రమ నిర్మాణాలు

ప్రస్తుతం ఉన్న నిర్మాణాలపై చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో మరిన్ని అక్రమ నిర్మాణాలు వెలిసే అవకాశం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు. ఒక నిర్మాణాన్ని చూసి మరొకరు అదే విధంగా నిర్మాణం చేపడితే పరిస్థితి మరింత జటిలంగా మారే ప్రమాదం ఉందని అంటున్నారు.

### » అధికారుల చర్యలపై ఉత్కంఠ

ఆమ్ బజార్, మెయిన్ రోడ్డు పరిధిలో డ్రైనేజీలపై జరుగుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నిర్మాణాలపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. నిబంధనలు ఉల్లంఘించిన నిర్మాణాలపై విచారణ జరిపి, వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

### » అడ్డుకట్ట పడేనా?

ఇల్లందు ఆమ్ బజార్, మెయిన్ రోడ్డు ప్రాంతాల్లో డ్రైనేజీలపై నిర్మాణాల పరంపరకు అధికారులు అడ్డుకట్ట వేస్తారా? లేక యథావిధిగా కొనసాగుతుందా? అన్న ప్రశ్నలు ప్రజల్లో నెలకొన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## ఇందిరమ్మ ఇల్లు.. సొంతింటి కల సాకారం

- పర్స వెంకట్ ఆధ్వర్యంలో గృహప్రవేశ కార్యక్రమం



**అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 24 (ప్రజా జ్యోతి ):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పర్స వెంకట్ ఆధ్వర్యంలో షేక్ ఇమ్రాన్ నూతనంగా నిర్మించుకున్న ఇంటి గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పివిఆర్ యూత్ సభ్యులు హాజరై గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సొంతింటి కలను సాకారం చేసే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడం పట్ల షేక్ ఇమ్రాన్ కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. నూతన ఇంటిలో గృహప్రవేశం చేయడం ఆనందంగా ఉందని తెలిపారు.ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడంలో సహకరించిన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పర్స వెంకట్‌కు షేక్ ఇమ్రాన్ కృతజ్ఞతలు తెలిపారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు కూడా ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి చేపడుతున్న కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పూర్ణచంద్రరావు, రంజా శ్రీను, చింతం నరసింహ, మాజీ సర్పంచ్ బోడా పద్మ, సాయి, బాలసాని శ్రీను, నానాసాహెబ్, కాంగ్రెస్ కార్యకర్తలు, పివిఆర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## మండలంలో మెచ్చా నాగేశ్వరరావు విస్తృత పర్యటన

- పార్టీ బలోపేతమే లక్ష్యం.. కార్యకర్తలకు అండగా ఉంటా

**అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 24 (ప్రజా జ్యోతి):** అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి మెచ్చా నాగేశ్వరరావు సోమవారం అన్నపురెడ్డిపల్లి మండలంలో విస్తృతంగా పర్యటించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలను కలుసుకుని వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై నాయకులతో చర్చించారు.మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద స్థానిక బీఆర్ఎస్ నాయకులతో సమావేశమైన మెచ్చా నాగేశ్వరరావు పార్టీ పరిస్థితిపై చర్చించారు. అనంతరం మర్రిగూడెం గ్రామంలో వీరబోయిన వెంకటేశ్వర్లు నివాసానికి వెళ్లి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయంతో పనిచేసి పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని సూచించారు.మర్రిగూడెం గ్రామంలో ఇటీవల మృతి చెందిన మాజీ సర్పంచ్ సడియం బుజ్జి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. గ్రామానికి బుజ్జి అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు.అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో జరిగిన పెద్దగౌడ్ల సీతారాములు దశదిన కార్యక్రమంలో పాల్గొని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. అనంతరం పెంట్లం గ్రామంలో ప్రమాదవశాత్తు మృతి చెందిన ఇనుపనూరి సంతోష్ కుటుంబాన్ని పరామర్శించి, చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.మెచ్చా నాగేశ్వరరావు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీని నియోజకవర్గంలో మరింత బలోపేతం చేయడమే తన లక్ష్యమన్నారు. కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని, ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని తెలిపారు. గ్రూపు రాజకీయాలకు తావు లేకుండా పార్టీ ప్రయోజనాలు, ప్రజా సమస్యలే ప్రధానంగా పనిచేయాలని సూచించారు. కష్టపడే ప్రతి కార్యకర్తను పార్టీ గుర్తిస్తుందని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని మెచ్చా నాగేశ్వరరావు విమర్శించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు సెప్టెంబర్ 2 నుంచి వారం రోజుల పాటు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యక్రమాలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు బోయినపల్లి సుధాకర్ రావు, పెంట్లం సర్పంచ్ కారం శివ, మాజీ ఎంపీటీసీ కృష్ణారెడ్డి, అన్నపురెడ్డిపల్లి ఉపసర్పంచ్ మారగాని అశోక్, చల్లా రాంబాబు, పెద్దగౌండ్ల పుల్లారావు, పర్స మాధవరావు, పానుగంటి రాఘవులు, కొండేటి నరసింహ తదితర బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.





## ఆశ్వారావుపేట మండలంలో గ్రీవెన్స్ డే నిర్వహణ




అశ్వరావుపేట ప్రజా జ్యోతి ఆగస్టు 24 ప్రభుత్వం ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి సత్వర పరిష్కారం అందించే ఉద్దేశంతో ప్రతి మండల పరిషత్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే నిర్వహించే విధంగా చర్యలు చేపట్టింది.ఈ కార్యక్రమంలో భాగంగా ఈరోజు అనగా 24-08-2026న ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంటల వరకు ఆశ్వారావుపేట మండల పరిషత్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొని ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు.ఈ గ్రీవెన్స్ డే కార్యక్రమానికి మొత్తం 06. దరఖాస్తులు అందాయి. **శాఖల వారీగా దరఖాస్తుల వివరాలు:** –పంచాయతీ రాజ్ శాఖ – 2 దరఖాస్తులు, – రెవెన్యూ శాఖ – 3 దరఖాస్తులు, – మున్సిపల్ కార్యాలయం , – హౌసింగ్ శాఖ – 1 దరఖాస్తు **మొత్తం దరఖాస్తులు:** 06, అందిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేసి, నిబంధనల ప్రకారం పరిశీలించి తగిన చర్యలు తీసుకునే విధంగా సూచనలు చేయడం జరిగింది. ప్రజల సమస్యలను ప్రాధాన్యతతో పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

## ఇచ్చిన మాటను కొనసాగిస్తున్న పెండేల హరికృష్ణ

- జమ్మిలా వేగం కుటుంబానికి రూ. 5వేల ఆర్థిక సాయం



**ఇల్లందు, ఆగస్ట్ 24 (ప్రజా జ్యోతి)** గత మున్సిపల్ ఎన్నికల మేనిఫెస్టో లో 17వ వార్డులో ప్రతి ఒక్క బీద కుటుంబంలో ఆరోగ్య సమస్యలు, ఆడపిల్ల పెళ్లిలకు, మృతి చెందిన కుటుంబాలకు రూ. 5 వేల ఆర్థిక సహాయం చేస్తానని హామీ ఇచ్చిన శ్రీహరివాసం గ్రూప్ చైర్మన్ పెండేల హరికృష్ణ ఇచ్చిన మాటను కొనసాగిస్తూనే ఉన్నారు. ఈ క్రమంలో 17వ వార్డు నివాసి షాహిన్ తల్లి జమ్మీలా వేగం అనారోగ్యంతో మృతి చెందడంతో విషయం తెలుసుకున్న శ్రీహరివాసం గ్రూప్ చైర్మన్ పెండేల హరికృష్ణ సోమవారం వారి స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా పెండేల హరికృష్ణ మాట్లాడుతూ గత మున్సిపల్ ఎన్నికల మేనిఫెస్టో లో భాగంగా అర్హులైన పేద కుటుంబాలకు అవసరమైన సమయంలో ఆర్థికంగా అండగా నిలవడం జరుగుతుందని స్పష్టం చేశారు. తమ వార్డులో పేద కుటుంబానికి చెందిన ఆడపిల్ల పెళ్లికి, అనారోగ్య సమస్యలు ఉన్న వారికి, మృతి చెందిన కుటుంబాలకు తాను ఆర్థిక సాయం చేస్తానని స్పష్టం చేశారు. అనంతరం షాహిన్ మాట్లాడుతూ తమ కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విషయం తెలుసుకున్న శ్రీహరి వాసం గ్రూప్ చైర్మన్ పెండేల హరికృష్ణ రూ.5 వేల ఆర్థిక సాయం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. బాధలో ఉన్న తమ కుటుంబాన్ని ఆదుకొని ఆర్థిక సాయం చేసి పెండేల హరికృష్ణ మంచు మనసును ఎప్పటికీ మర్చిపోలేమని, ఆ భగవంతుడు ఎల్లప్పుడూ వారిని చల్లగా చూడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వార్డు పెద్దలు మాడిశెట్టి రాజు, జియా, బాబా, ప్రజలు పాల్గొన్నారు.

## ఆపదలో ఉన్న కుటుంబానికి ఉపసర్పంచ్ ఆర్థిక చేయూత



**బూర్గంపహాడ్, ఆగస్టు 24 (ప్రజాజ్యోతి):** బూర్గంపహాడ్ మండలం కృష్ణసాగర్ గ్రామానికి చెందిన కొప్పుల ఇంద్ర అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు.విషయం తెలుసుకున్న కృష్ణసాగర్ గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ భూక్య మోహన్ రావు మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి రూ.3 వేల ఆర్థిక సాయం అందజేశారు.మోహన్ రావు మాట్లాడుతూ ప్రజల సమస్యల ను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వారికి అండగా నిలుస్తున్నామని తెలిపా రు. ఆపదలో ఉన్న కుటుంబాలకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తూ సేవా కార్యక్రమాలను భవిష్యత్తులోనూ కొనసాగిస్తామని పేర్కొన్నారు.కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోడ దివ్య, పిల్లి రవి వర్మ, గుర్రం సురేష్, పిల్లి వీరయ్య, గ్రామ పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ సమావేశానికి ఆళ్ళపల్లి మండల నాయకులు

**ఆళ్ళపల్లి,ఆగస్టు24 (ప్రజా జ్యోతి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఆధ్వర్యంలో సోమవారం మణుగూరులో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల బైక్ ర్యాలీ, సమావేశానికి ఆళ్ళపల్లి మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆళ్ళపల్లి మాజీ ఎంపీపీ కొండ్రు మంజు భార్గవి, మండల అధ్యక్షుడు పాయం నరసింహారావు, నాయకులు మహమ్మద్ ఆదాం, వేమూరి రాంబాబు, వార్డు సభ్యులు తాళ్లపల్లి ఎల్లాగౌడ్, కొమరం వెంకట కృష్ణంరాజు, కొంపెల్లి సాంబయ్య, తాళ్లపల్లి మురారి, అంబోజు నవీన్ తదితరులు రేగా కాంతారావును మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, కార్యకర్తల సమన్వయం, భవిష్యత్ కార్యక్రమాలపై నాయకులు తెలిపారు.



# ఆర్థిక వ్యవహారాలలో సరైన అవగాహన ఎంతో అవసరం

- అదనపు కలెక్టర్ వేణుగోపాల్
- ఆర్థిక అక్షరాస్యత పోస్టర్ను ఆవిష్కరించిన అదనపు అడిషనల్ కలెక్టర్లు



**కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 24,(ప్రజా జ్యోతి)** గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక అక్షరాస్యత, ఆర్థిక అవగాహనను పెంపొందించేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ముద్రించిన వాల్ పోస్టర్లను సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ఐ డి ఓ సి సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, అడిషనల్ కలెక్టర్ విద్య చందనలు ఆవిష్కరించారు ,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూఆర్థిక వ్యవహారాలలో సరైన అవగాహన అప్రమత్త ఎంతో అవసరమని రిజర్వ్ బ్యాంక్ వారు ఈ దిశగా చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు, అనంతరం లీడ్ బ్యాంక్ మేనేజర్ రామిరెడ్డి మాట్లాడుతూభద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 6 ఆర్థిక అక్షరాస్యత కేంద్రాలను ( సుజాత నగర్, లక్ష్మీదేవిపల్లి, టేకులపల్లి , మణుగూరు, భద్రాచలం, దమ్మపేట ) మంజూరు చేశారు. ప్రతి కేంద్రంలో "విడ్స్ " స్వచ్ఛంద సంస్థ ద్వారా, ముగ్గురు కౌన్సిలర్స్ ను నియమించి, వారికి ట్రైనింగ్ ఇవ్వడం జరిగిందన్నారు, వారికి కేటాయించిన గ్రామాలలో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, ప్రజలకు పొదుపు, పెట్టుబడి, ఆర్థిక క్రమశిక్షణ, బ్యాంక్ లావాదేవీలపై అవగాహన, బ్యాంక్ రుణాలు, సక్రమ రుణ చరిత్ర అవశ్యకత, సైబర్ మోసాల విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు, ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ఆర్థిక శిక్షణా కేంద్రాల కౌన్సిలర్స్ పాల్గొన్నారు.

## పాత రెడ్డిపాలెంకు రేషన్ షాప్ కేటాయించాలి



**పినపాక,ఆగష్టు 24(ప్రజా జ్యోతి)** పినపాక మండలం పాత రెడ్డిపాలెం గ్రామాని కి ప్రత్యేకంగా రేషన్ షాప్ కేటాయించాలని కోరుతూ గ్రామ సర్పంచ్ సాగబోయి న నాగకుమారి, ఉప సర్పంచ్ సాని కొమ్మ శ్రీనివాసరెడ్డి పినపాక తహసీల్దార్ శ్రీనివాస రెడ్డికి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో రేషన్ షాప్ లేకపోవడంతో ప్రజ లు నిత్యావసర రేషన్ సరుకుల కోసం ఇతర గ్రామాలకు వెళ్లాల్సి వస్తోందని వారు తెలిపారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు రేషన్ సరుకులు పొం దేందుకు దూర ప్రాంతాలకు వెళ్లడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు . గ్రామంలో అర్హులైన రేషన్ కార్డు లబ్ధిదారులు అధిక సంఖ్యలో ఉన్నందున ప్రజల సౌకర్యార్థం పాత రెడ్డిపాలెంకు రేషన్ షాప్ మంజూరు చేయాల్సిన అవస రం ఉందన్నారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులు ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వెంటనే స్పందించి రేషన్ షాప్ ఏర్పాటు చేయాలని సర్పంచ్, ఉప సర్పంచ్ కోరారు.

## పాల్వంచ మండలం తుమ్మలగూడెం పి హెచ్ సి ని సందర్శించిన డిఎం అండ్ హెచ్ ఓ తుకారం రాథోడ్

- జ్వరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు

**కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 24,(ప్రజా జ్యోతి)** పాల్వంచ మండల పరిధిలోని ఉల్వనూర్ పీహెచ్‌సీ పరిధిలో ఇటీవల జ్వరంతో ఒకరు మరణించగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. తుకారం రాథోడ్ సోమవారం పాల్వంచ మండల పరిధిలోని తుమ్మలగూడెం పీహెచ్‌సీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య శిబిరం, ఏఎల్‌ఓ, డ్రై డే కార్యక్రమాలను పరిశీలించి ప్రజలు, సర్పంచ్, వైద్య సిబ్బందితో మాట్లాడారు.జ్వర కేసులపై ఇంటింటి సర్వే నిర్వహించాలని, ప్రతి కేసును క్షుణ్ణంగా పరిశీలించాలని సిబ్బందిని ఆదేశించారు. జ్వర కేసులను వెంటనే ఉన్నత వైద్య కేంద్రాలకు, అవసరమైతే 108 ద్వారా తరలించాలని సూచించారు. స్వల్ప జ్వర కేసులను ప్రతి నాలుగు గంటలకు పర్యవేక్షించాలని, పరిస్థితి విషమిస్తే తక్షణమే ఆస్పత్రికి తరలించాలని ఆదేశించారు.అలాగే గ్రామాల్లో ఏఎల్‌ఓ, డ్రై డే కార్యక్రమాలను పంచాయతీ సిబ్బంది సహకారంతో ప్రతిరోజూ నిర్వహించాలని, గర్భిణీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. జ్వర కేసుల విషయంలో నిర్లక్ష్యం చేయకుండా అప్రమత్తంగా ఉండాలని ఆశ కార్యకర్తలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు వైద్యాధికారి సిబ్బందికి సూచనలు చేశారు.



## ప్రజావాణిలో వచ్చిన వినతులను తక్షణమే పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ వేణుగోపాల్



**కొత్తగూడెం కలెక్టరేట్ ,ఆగస్టు 24,(ప్రజా జ్యోతి)** ప్రజావాణిలో ప్రజల నుండి వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించి వాటిని తక్షణమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్, అడిషనల్ కలెక్టర్ విద్యా చందనలు సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు, సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ మండలాల నుండి వచ్చిన ప్రజలు పలు సమస్యలతో కూడిన వినతి పత్రాలను జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్, అడిషనల్ కలెక్టర్ విద్యాచందన, డి ఆర్ ఓ పద్మావతి లో స్వీకరించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజావాణిలో ప్రజలు విన్నవించిన సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రజావాణి కీలక వేదికగా నిలుస్తోందన్నారు. జిల్లా కేంద్రంతో పాటు మండల స్థాయిలోని ఎంపీడీఓ కార్యాలయాల్లో కూడా ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

**ప్రజావాణిలో వచ్చిన కొన్ని వినతులు** ఇల్లందు మండలానికి చెందిన రచ్చ సుజాత 2008లో ఉమ్మడి ఖమ్మం జిల్లా కలెక్టర్ సమక్షంలో జనజీవన స్రవంతిలోకి వచ్చి లొంగిపోయినట్లు తెలిపారు. సీపీఐ (ఎంఎల్) పీపీజీ గ్రూప్‌కు చెందిన లింగన్న దళంలో ఆరు సంవత్సరాల పాటు దళ సభ్యురాలిగా పనిచేసిన అనంతరం లొంగిపోయిన సమయంలో ప్రభుత్వం ఐదు ఎకరాల భూమి ఇస్తామని హామీ ఇచ్చినట్లు, ప్రస్తుతం భర్త మృతి చెందడంతో ముగ్గురు పిల్లలతో ఒంటరి మహిళగా జీవిస్తున్నానని, ఇప్పటివరకు భూమి కేటాయించలేదని, తనకు హామీ ఇచ్చిన ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని మంజూరు చేయాలని కోరుతూ చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యలు నిమిత్తం ఓఎస్–ఈకి ఎండార్స్ చేశారు.అశ్వారావుపేట మండలం దిబ్బగూడెం గ్రామానికి చెందిన తాటి పద్మ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు. గతంలో సమర్పించిన దరఖాస్తును పరిశీలించి అర్హత మేరకు ఇల్లు మంజూరు చేయాలని కోరగా పరిశీలించి తగు చర్యలు నిమిత్తం పీడీ హౌసింగ్‌కు ఎండార్స్ చేశారు. కొత్తగూడెం కార్పొరేషన్ 53వ డివిజన్‌కు చెందిన ముద్దంగుల మహేష్ రహదారి మధ్యలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించి సురక్షిత ప్రాంతంలో ఏర్పాటు చేయాలని కోరుతూ చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యలు నిమిత్తం ఎన్‌పీడీసీఎల్‌కు ఎండార్స్ చేశారు.సుజాతనగర్ మండలం సర్వారం తండాకు చెందిన బాణోత్ హిమబిందు తన కుటుంబం గతంలో అంగన్‌వాడీ పాఠశాల నిర్మాణం కోసం ప్రభుత్వానికి భూమి ఇచ్చిన విషయాన్ని పరిగణనలోకి తీసుకుని, తాను డిప్లొమా, బీటెక్ పూర్తి చేసినందున అర్హత మేరకు ప్రభుత్వ ఉద్యోగం లేదా అంగన్‌వాడీ పోస్టు కల్పించాలని కోరుతూ చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యలు డీడబ్ల్యూఓకు ఎండార్స్ చేశారు. అశ్వారావుపేట మండలం రామన్నగూడెం సర్పంచ్ మడకం నాగేశ్వర రావు ఎల్–3 జాబితాలో ఉన్న అర్హులైన 71 మంది లబ్ధిదారులను ఎల్–1 జాబితాలోకి మార్చి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ చేసిన దరఖాస్తును తగు చర్యల నిమిత్తం పీడీ హౌసింగ్‌కు ఎండార్స్ చేశారు.ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి
- అనామలీస్, మ్యాపింగ్ కాని ఓటర్లకు నోటీసుల జారీపై ప్రత్యేక దృష్టి
- వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్





**కొత్తగూడెం కలెక్టరేట్ ,ఆగస్టు 24 , (ప్రజా జ్యోతి)** కొత్తగూడెం జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి సూచించారు.ఎస్ఐఆర్ ప్రక్రియపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కొత్తగూడెం జిల్లా ఐడీఓసీ కార్యాలయం నుంచి జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ, అనామలీస్, మ్యాపింగ్ కాని ఓటర్లకు నోటీసులు జారీ చేసే ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పూర్తి చేయాలని సూచించారు. నోటీసులు జారీ చేసిన అనంతరం అవసరమైన ఓటర్లను విచారణకు పిలిపించి, సంబంధిత పత్రాలు, ఆధారాలను పరిశీలించాలని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో పారదర్శకత, ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.నోటీసులు జారీ చేసే సమయంలోనే విచారణకు హాజరయ్యే ఓటర్లు సమర్పించాల్సిన అవసరమైన పత్రాలు, ఆధారాలపై స్పష్టమైన అవగాహన కల్పించాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ సంబంధిత ఎన్నికల అధికారులతో మాట్లాడుతూ, జిల్లాలో అనామలీస్, మ్యాపింగ్ కాని ఓటర్లకు నోటీసుల జారీ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి నోటీసులో విచారణ తేదీ, విచారణ జరిగే ప్రదేశం, సమయాన్ని స్పష్టంగా పేర్కొనాలని తెలిపారు.నోటీసు జారీ చేసిన తేదీకి, విచారణ తేదీకి మధ్య కనీసం ఏడు రోజుల వ్యవధి ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నోటీసులు అందజేసిన వివరాలను బీఎల్ఓ యాప్‌లో ఫొటోతో సహా నమోదు చేయాలని, విచారణకు సంబంధించిన వివరాలతో పాటు ఓటర్లు సమర్పించిన పత్రాలు, ఆధారాలను కూడా యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.ఎస్ఐఆర్ ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు, బూత్ స్థాయి అధికారులకు అవసరమైన అవగాహన కల్పిస్తూ సమన్వయంతో ముందుకు వెళ్లాలని అదనపు కలెక్టర్ సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్లో ఎన్నికల విభాగం సూపర్డెంట్ రంగ ప్రసాద్ , సంబంధిత శాఖల అధికారులు,ఎన్నికల సిబ్బంది నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## దళితుల భూమిని సర్వే చేసి న్యాయం చేయాలి



**ఆళ్ళపల్లి, ఆగస్టు 24 (ప్రజా జ్యోతి )**మండల కేంద్రంలోని దళితులకు 1977 లో నివాసాల కోసం కేటాయించిన భూమి ఆక్రమణకు గురైందని, సంబంధిత భూమిని సర్వే చేసి తమకు న్యాయం చేయాలని కోరుతూ దళితులు సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా దళితులు మాట్లాడుతూ.. అప్పటి సుదీమల్ల తాలూకా తహసీల్దార్ జారీ చేసిన ఆధారాల ప్రకారం 484 సర్వే నంబర్‌లో 2 ఎకరాల 20 గుంటల భూమిని దళితుల నివాసాల కోసం కేటాయించినట్లు తెలిపారు. ఆ సమయంలో అగ్ని ప్రమాదం జరగడంతో పాటు నివాసానికి అనుకూల పరిస్థితులు లేకపోవడం, మంచినీటి సదుపాయం లేకపోవడంతో ఆ భూమిని వ్యవసాయ అవసరాలకు వినియోగించుకున్నట్లు పేర్కొన్నారు.అయితే ప్రస్తుతం కొందరు ఆ భూమిని ఆక్రమించి నకిలీ పట్టాలు సృష్టించారని ఆరోపించారు. భూమికి సంబంధించిన పూర్తి ఆధారాలను అధికారుల ముందు చూపాలని కోరినప్పటికీ, ఆధారాలు సమర్పించకుండా తమ బంధువైన ఎస్టీ కుటుంబానికి చెందిన మహిళకు భూమిని విక్రయించినట్లు చెబుతూ ఆమెను ముందుకు తీసుకురావడం సరికాదని అన్నారు.దళితుల మనుగడ కోసం కేటాయించిన భూమి అన్యాక్రాంతానికి గురవుతున్నా, తమకు న్యాయం చేయాల్సిన అధికారులు ఆక్రమణదారులకు వంతపాడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు 484 సర్వే నంబర్‌లోని భూమిని సమగ్రంగా సర్వే చేసి, అందుబాటులో ఉన్న పాత రికార్డులను పరిశీలించి దళిత కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు.

## గురుకుల టెండర్ల పై జరిగిన అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

- గ్రీవెన్స్ లో జెసికి వినతి పత్రం అందజేసిన జిల్లా స్వేరోస్ అధ్యక్షులుకేసరి రవీందర్

**కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 24 ,(ప్రజా జ్యోతి )** కొత్తగూడెం జిల్లా సాంఘిక సంక్షేమ హాస్టల్ టెండర్లలో జరిగిన అవినీతి నిబంధనల ఉల్లంగన పై విచారణ జరిపి సంబంధిత ఉద్యోగులను సస్పెండ్ చేయాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్లో నిర్వహించిన గ్రీవెన్స్ డే లో జిల్లా స్వేరోస్ అధ్యక్షులు కేసరి రవీందర్ జాయింట్ కలెక్టర్ వేణుగోపాలకు వినతి పత్రం అందజేశారు, ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ ఈనెల 13న జేసి ఆధ్వర్యంలో జరిగిన టెండర్లలో ఉద్యోగులు కుమ్మక్కై నిబంధనలను తుంగలో తొక్కి చేసిన అక్రమాలపై వీడియో ఆధారిత సాక్షాలను పరిగణలోకి తీసుకొని తక్షణమే చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరినట్లు రవీందర్ తెలిపారు, కొత్తగూడెం జిల్లాలో నిర్వహించబడుతున్న (9) తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల టెండర్ల ప్రక్రియలో తీవ్రమైన అవినీతి , అక్రమాలు చోటు చేసుకున్నాయన్నారు, ఇందులోప్రధాన అక్రమాలు , వీడియో ఆధారాలు గారాజు అండ్ సన్స్ అక్రమ టెండర్ దాఖలు:రాజు అండ్ సన్స్ కు చెందిన బడా వ్యాపారవేత్తలు టెండర్ సమయం ముగిసిపోయిన తర్వాత బాక్స్‌లో టెండర్ పత్రాలు వేసినప్పటికీ, వాటిపై సంతకాలు లేకపోయినా సంబంధిత ఉద్యోగులు వారికే టెండర్లు కేటాయించడం జరిగిందన్నారు, వీటికి తగిన (వీడియో ఆధారాలు కూడా ఉన్నాయన్నారు, ఉద్యోగినుల అనధికార జోక్యం రామారావు కుజెసి టెండర్లు ఓపెన్ చేసేటప్పుడు చెప్పిన నియమాలకు విరుద్ధంగా, ఇద్దరు ఉద్యోగినులు బయటికి వచ్చి తప్పుగా ఉన్న పేపర్‌ను తీసి, కావలసిన పత్రాన్ని జతచేసి రామారావు కే టెండర్లు వచ్చేలా చేయడం జరిగిందని తెలిపారు.

**ఎస్సీ, ఎస్టీలకు తీవ్ర అన్యాయం...**ఎస్సీ ఎస్టీ లకు ఏ టెండర్ లోనైనా రూ. 50 లక్షల వరకు టర్నోవర్ నిబంధన ఉన్నప్పటికీ, ఒక్క టెండర్ కూడా ఎస్ సి ఎస్ టి లకు దక్కకుండా కుట్రపూరితంగా వ్యవహరించి తీవ్ర అన్యాయానికి గురిచేశారన్నారు, ఎప్పటికైనా అధికారులు 13న జరిగిన టెండర్ల ప్రక్రియను పూర్తిగా రద్దు చేసి అర్హులైన పేద, ఎస్సీ, ఎస్టీ మహిళా కాంట్రాక్టర్లకు న్యాయం చేయాలని వినతిపత్రంలో కోరినట్లు తెలిపారు, వినతి పత్రానికి స్పందించిన జాయింట్ కలెక్టర్ వేణుగోపాల్ ఈ విషయంపై సాంఘిక సంక్షేమ వెల్ఫేర్ డిడి కి విచారణ చేయాలని ఎండార్స్ చేశారు.



## చర్లలో ల్యాబ్‌లు, మెడికల్ షాపుల తనిఖీ





**చర్ల, ఆగస్టు 24: (ప్రజా జ్యోతి ):**చర్లలోని మెడికల్ షాపులు, ల్యాబొరేటరీలను జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. ప్రతాప్, డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ, డి ఐ ఓ భద్రాద్రి కొత్తగూడెం అధికారులు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మెడికల్ షాపులు, ల్యాబ్‌ల రిజిస్ట్రేషన్, అనుమతులు, ఇతర అవసరమైన పత్రాలను పరిశీలించారు.ల్యాబొరేటరీల్లో నిర్వహించే వివిధ రకాల రక్త పరీక్షలకు సంబంధించిన ధరల పట్టికను ప్రజలకు స్పష్టంగా కనిపించే విధంగా ప్రదర్శించాలని నిర్వాహకులకు సూచించారు. మెడికల్ షాపులు, ల్యాబొరేటరీల నిర్వహణకు అవసరమైన అన్ని అనుమతులు తప్పనిసరిగా కలిగి ఉండాలని ఆదేశించారు.అనంతరం డా. ప్రతాప్ మాట్లాడుతూ చర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో అర్హత కలిగిన వైద్యులు, అవసరమైన వైద్య సదుపాయాలు, మందులు, వివిధ రకాల వైద్య పరీక్షలు అందుబాటులో ఉన్నాయని ప్రజలు వీలైనంత వరకు ప్రభుత్వ ఆసుపత్రి సేవలను వినియోగించుకోవాలని అవసరం లేని ప్రైవేట్ వైద్య సేవలను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోవద్దని సూచించారు.ఈ కార్యక్రమంలో చర్ల వైద్యాధికారి డా. హారిక, డిప్యూటీ ఎడ్యుకేషన్ మాస్ మీడియా ఆఫీసర్ నాగలక్ష్మి, హెల్త్ సూపర్వైజ ర్లు కృష్ణయ్య, రామ్ ప్రసాద్, ల్యాబ్ టెక్నీషియన్ గోపి పాల్గొన్నారు.

## విద్యుత్ బిల్లుల బకాయిలు మాఫీ చేయండి

- ఎంపీడీవో కి వినతి పత్రం అందజేత



**చర్ల, ఆగస్టు 24:(ప్రజా జ్యోతి):**చర్ల మండలంలోని 26 గ్రామపంచాయతీలకు సంబంధించి గత మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బిల్లుల బకాయిలను మాఫీ చేయాలని కోరుతూ సర్పంచులు ఎంపీడీవోకు వినతిపత్రం సమర్పించారు.గ్రామపంచాయతీలకు సంబంధించిన విద్యుత్ బిల్లుల బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో పంచాయతీలపై ఆర్థిక భారం పెరుగుతోందని సర్పంచ్ లు సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా ఈ సమస్యను ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లారు.గత మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బిల్లుల బకాయిలను మాఫీ చేయించి గ్రామపంచాయతీలపై ఉన్న ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో చర్ల మేజర్ పంచాయతీ సర్పంచ్ పూజారి సామ్రాజ్యం , ఉప్పరగూడెం సర్పంచ్ సోయం నాగలక్ష్మి,ఆర్ కొత్తగూడెం సర్పంచ్ తుర్రం రవి కేశవాపురం సర్పంచ్ కాపుల శారద కలివేరు సర్పంచ్ తెల్లం లక్ష్మణ్ పాల్గొన్నారు.

## మావోయిస్టుల భారీ డంప్ స్వాధీనం

- ఆయుధాలు, పేలుడు పదార్థాలు స్వాధీనం






**చర్ల , ఆగస్టు 24:(ప్రజా జ్యోతి ):**ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో నక్సల్స్‌కు చెందిన భారీ ఆయుధాలు, మందుగుండు సామగ్రి, పేలుడు పదార్థాల డంప్‌ను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. భేజ్జీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని భండార్‌పదర్, మునుర్‌కొండ అటవీ–కొండ ప్రాంతాల్లో సోమవారం జిల్లా బలగాలు, డీఆర్‌జీ, బస్తర్ ఫైటర్స్ సంయుక్తంగా నిర్వహించిన ఏరియా డామినేషన్, సెర్చింగ్ ఆపరేషన్‌లో ఈ డంప్ వెలుగుచూసింది.లొంగిపోయిన నక్సలైట్ల నుంచి లభించిన నిఘా సమాచారంతో ఈ ఆపరేషన్ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. తనిఖీల్లో నక్సలైట్లు గతంలో అడవుల్లో దాచిపెట్టిన ఆయుధాలు, మందుగుండు సామగ్రి, పేలుడు పదార్థాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.స్వాధీనం చేసుకున్నవాటిలో ఒక ఎస్ ఎల్ ఆర్ రైఫిల్, ఒక .315 బోర్ రైఫిల్, ఒక .410 మస్కెట్, ఆరు బి జి ఎల్ లాంచర్లు, ఐదు 12 బోర్ రైఫిళ్లు, ఒక సింగిల్ షాట్ రైఫిల్, ఒక .315 దేశీ పిస్టల్, ఏడు భర్మర్ తుపాకులు ఉన్నాయి. అలాగే ఏ కె – 47, ఎస్ ఎల్ ఆర్ , ఇన్సాస్, .303, .315, 12 బోర్ రైఫిళ్లకు సంబంధించిన మొత్తం 492 సజీవ రౌండ్లు స్వాధీనం చేసుకున్నారు.అదేవిధంగా 240 జిలెటిన్ స్టిక్స్, 18 కిలోల గన్‌పౌడర్, ఐదు దేశీ హ్యాండ్ గ్రెనేడ్లు, వివిధ పరిమాణాల్లో బి జి ఎల్ షెల్స్, 66 బి జి ఎల్ కార్ట్రిడ్జ్‌లు తదితర పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు మ్యాగజైన్లు, పౌచ్‌లు, యూనిఫాంలు, బెల్టులు, సోలార్ ప్లేట్లు, మందులు, ఇతర నిత్యావసర సామగ్రిని కూడా స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు.సుక్మా ఎస్పీ మయాంక్ గుర్జర్, అదనపు ఎస్పీ (నక్సల్ ఆప్స్) రోహిత్ షా మార్గదర్శకత్వంలో ఈ ఆపరేషన్ నిర్వహించినట్లు తెలిపారు. నక్సల్స్ నిర్మూలనలో భాగంగా అడవులు, దుర్గమ ప్రాంతాల్లో గతంలో దాచిపెట్టిన ఆయుధాలు, మందుగుండు సామగ్రి, పేలుడు పదార్థాల డంప్‌లను గుర్తించేందుకు నిరంతరం సెర్చింగ్, ఏరియా డామినేషన్ ఆపరేషన్లు కొనసాగిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.స్వాధీనం చేసుకున్న సామగ్రిపై నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు కొనసాగుతున్నాయని సుక్మా జిల్లాలో శాంతి భద్రతతో పాటు అభివృద్ధికి అనుకూల వాతావరణాన్ని కొనసాగించేందుకు పోలీసుల చర్యలు మరింత ముమ్మరం చేస్తామని అధికారులు తెలిపారు.

## ఏకలవ్య పాఠశాలలో తీజ్ పండుగ వ్యవహారంపై సబ్ కలెక్టర్కు గిరిజన సంఘాల వినతి



**గుండాల ఆగస్టు 24 ప్రజాజ్యోతి** ఏకలవ్య పాఠశాలలో తీజ్ పండుగ పేరిట గిరిజన , లంబాడ విద్యార్థుల మధ్య వివక్షత, వర్గ వైశ్యామ్యాలు సృష్టించిన లంబాడ అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులతో పాటు గేట్ కీపర్ పై చర్యలు తీసుకోవాలని కోరుతూ సబ్ కలెక్టర్ కిచెన్ సంఘ నాయకులు వినతి పత్రం అందజేశారు . సోమవారం గిరిజన సంఘ ప్రతినిధులైన తుడుం దెబ్బ జాతీయ ఉపాధ్యక్షులు కోడం వెంకటేశ్వర్లు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ముక్తిరాజు, ఆదివాసి పొలిటికల్ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ వాసం రామకృష్ణ, తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షులు సంప కోటేశ్వరరావు, ఆదివాసి సంక్షేమ పరిషత్ జిల్లా కార్యదర్శి సోంది మల్లు దొర, జిల్లా నాయకులు ఈసం ఉదయ్ లు సబ్ కలెక్టర్కు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు . గుండాల మండలం ముత్తాపురం గ్రామంలోని ఏకలవ్య పాఠశాలలో గిరిజన విద్యార్థులపై లంబాడ ఔట్సోర్సింగ్ ఉపాధ్యాయులు వివక్షత చూపిస్తూ, పాఠశాలలో వర్గ విభేదాలకు కారణమవుతున్నారని, పాఠశాల ముందు గిరిజన సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేయడంతో తాత్కాలిక ఉపశమనం కింద బదిలీ చేశారని, వారిని బదిలీ కాకుండా రిమూవ్ చేయాలని కోరారు. వారిపై వేటు వేయడం ద్వారా ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా నివారించడం జరుగుతుందని జిల్లా అధికారులకు వివరించినట్లు తెలిపారు.

## మండలంలో ప్రజావాణికి మూడు ఫిర్యాదులు

- 19 మంది మండల స్థాయి అధికారులు హాజరు




**అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 24 (ప్రజా జ్యోతి ):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మూడు ఫిర్యాదులు వచ్చినట్లు ఎంపీడీవో డి. రాజేశ్వరి తెలిపారు. కార్యక్రమానికి 19 మంది మండల స్థాయి అధికారులు హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. పెద్దిరెడ్డిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని పాత బూరుగుడెం చెరువు ఆక్రమణపై ఒక ఫిర్యాదు వచ్చింది. అన్నపురెడ్డిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కుమ్మరి కుంట కాలువ ఆక్రమణపై మరో ఫిర్యాదు అందింది. అలాగే రైతు జామాయిల్ తోటను వేరొకరు నరికివేశారని ఆరోపిస్తూ ఓ రైతు తహసీల్దార్కు ఫిర్యాదు చేశారు. ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను సంబంధిత అధికారులు పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో డి. రాజేశ్వరి తెలిపారు. ప్రజలు తమ సమస్యలను ప్రజావాణి ద్వారా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

## తాలిపేరులో పెరుగుతున్న వరద ఉధృతి



**చర్ల, ఆగస్టు 24 (ప్రజా జ్యోతి):** చర్ల మండలంలోని తాలిపేరు మధ్యతరహా నీటిపారుదల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. సోమవారం రాత్రి 8 గంటల సమయానికి ప్రాజెక్టులోకి 71,694 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా, ప్రాజెక్టు నుంచి 77,668 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.ప్రాజెక్టులోని 11 గేట్లను పూర్తిగా ఎత్తి నీటిని విడుదల చేస్తుండగా, మరో 6 గేట్లను 2 అడుగుల మేర ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు.ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం (ఎఫ్ఆర్ఎల్) 74.00 మీటర్లు కాగా, ప్రస్తుతం నీటిమట్టం 72.78 మీటర్లుగా నమోదైంది. ప్రాజెక్టు మొత్తం నిల్వ సామర్థ్యం 730 ఎంసీఎఫ్టీ కాగా, ప్రస్తుతం 514 ఎంసీఎఫ్టీ నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు క్రెస్ట్ లెవల్ 69.00 మీటర్లుగా ఉంది.భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# బస్సు ఎక్కాల్సిన గంజాయి.. పోలీసుల చేతికి చిక్కింది

- బెంగళూరుకు తరలించేలోపే భద్రాచలంలో పట్టివేత
- 19 కిలోల గంజాయితో ఇద్దరు అరెస్ట్
- రూ.9.41 లక్షల విలువైన గంజాయి, రెండు సెల్ఫోన్లు స్వాధీనం



**భద్రాచలం, ఆగస్టు 24, ప్రజాజ్యోతి :** బెంగళూరు వెళ్లేందుకు బస్సు ఎక్కాల్సిన గంజాయి.. అంతలోనే పోలీసుల చేతికి చిక్కింది. సుకుమ ప్రాంతం నుంచి రెండు ట్రాలీ లగేజ్ బ్యాగుల్లో గంజాయిని తీసుకొచ్చి భద్రాచలం ఆర్టీసీ బస్టాండ్ నుంచి బెంగళూరుకు తరలించేందుకు సిద్ధమైన ఇద్దరు వ్యక్తులను పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి సుమారు 19 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. భద్రాచలం డీఎస్పీ అరుణ్కుమార్ ఆదేశాల మేరకు పట్టణ ఎస్సై వి.సతీష్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం రాత్రి ఆర్టీసీ బస్టాండ్ పరిసరాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా.. పోలీసులను చూసి అనుమానాస్పదంగా పారిపోయేందుకు ప్రయత్నించిన ఇద్దరిపై అనుమానం వచ్చింది. వారిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా లగేజ్ బ్యాగుల్లో గంజాయి బయటపడింది. పోలీసుల విచారణలో నిందితులను ఉత్తరప్రదేశ్కు చెందిన అజయ్ అలియాస్ అజయ్ సైని, ఉజ్వల్ అలియాస్ ఉజ్వల్ సైనిగా గుర్తించారు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో గంజాయి రవాణాకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. పోలీసుల కథనం ప్రకారం.. మహమ్మద్ అష్రఫ్ ఖురేషి అనే వ్యక్తి రెండు ట్రాలీ లగేజ్ బ్యాగుల్లో గంజాయి ప్యాకెట్లను ఉంచి, బెంగళూరులోని సతీష్ అనే వ్యక్తికి అందజేయాలని నిందితులకు సూచించినట్లు వారు వెల్లడించారు. దీంతో సుకుమ ప్రాంతం నుంచి గంజాయిని తీసుకుని భద్రాచలం చేరుకున్నారు. అక్కడి నుంచి బెంగళూరు వెళ్లేందుకు బస్సు కోసం వేచి చూస్తుండగానే పోలీసులకు చిక్కారు. నిందితుల నుంచి సుమారు 19 కిలోల గంజాయి, దీని విలువ సుమారు రూ.9,41,500, అలాగే రెండు మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. భద్రాచలం పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసిన పోలీసులు.. ఇన్స్పెక్టర్ యం.నాగరాజు ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. అనంతరం నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్కు తరలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ అరుణ్కుమార్ మాట్లాడుతూ యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై నిఘా ఉంచి, మత్తు పదార్థాల బారిన పడకుండా అవగాహన కల్పించాలని కోరారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయం, నిల్వ, వినియోగంతో పాటు వాటికి సహకరించే వ్యక్తులపైనా కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు. మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయం, నిల్వకు సంబంధించిన సమాచారం ప్రజలకు తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

## డ్రగ్స్ నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత






**ఇల్లందు, ఆగస్ట్ 24 (ప్రజా జ్యోతి )** సమాజాన్ని పట్టిపీడిస్తున్న డ్రగ్స్ మహమ్మారి నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని ఇల్లందు సీఐ తాటిపాముల సురేష్ అన్నారు. సోమవారం ఇల్లందు పోలీస్ స్టేషన్ లో డ్రగ్స్ నిర్మూలనపై సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ మత్తు పదార్థాల వల్ల ఒక వ్యక్తి జీవితమే కాదని, ఆ కుటుంబం మొత్తం నాశనమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. యువత, విద్యార్థుల భవిష్యత్తును కాపాడటం ప్రజా ప్రతినిధులుగా మనందరి బాధ్యతని, ఇల్లందు డ్రగ్స్ రహిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో పాఠశాలలు, కళాశాలల్లో, వీధుల్లో డ్రగ్స్ వల్ల కలిగే శారీరక, మానసిక, చట్టపరమైన దుష్పరిణామాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలిపారు. అదే విధంగా బస్ స్టాండ్, పాన్ షాపులు, మెడికల్ షాపుల వద్ద అనుమానాస్పద కార్యకలాపాలపై నిఘా ఉంచి, ఎక్కడైనా గంజాయి అమ్మకం లేదా సాగు కనిపిస్తే వెంటనే ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ 1908, 8712671111 ఈగల్ కు సమాచారం అందించాలని సూచించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంచేందుకు ప్రతి వార్డు, ప్రతి గ్రామంలో క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి వారిని చైతన్యవంతులను చేయాలని కోరారు. అనంతరం డ్రగ్స్ నిర్మూలన కోసం వార్డు కౌన్సిలర్లు, సర్పంచులు తమ పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎస్ఐ లు ఉమ, సారంగపాణి, కౌన్సిలర్లు, సర్పంచులు, పోలీస్ సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఈ నెల 25న కొత్తగూడెంలో జరిగే ఓటర్ల జాబితా సవరణ ఫేజ్ - 2 ట్రైనింగ్ క్యాంపులో విధిగా హాజరు కావాలి

- డి.సి.ఎం.ఎస్ మాజీ చైర్మన్ కొత్వాల
- పి.సి.సి. సర్ ఇంచార్జి లింగోజితో కలిసి పాల్వంచ బి.ఎల్.ఎ.ల సమావేశంలో పాల్గొన్న కొత్వాల

**కొత్తగూడెం కలెక్టరేట్ , పాల్వంచ /ఆగస్టు 24 ,(ప్రజా జ్యోతి)** ఈ నెల 25న కొత్తగూడెం విద్యానగర్ కాలని లోని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో బి.ఎల్.ఎ.లకు, సూపర్ వైజర్ లకు మండల, పట్టణ, కాంగ్రెస్ అధ్యక్షుల కు జిల్లా పార్టీ నాయకులు,కార్పొరేటర్లకు, పంచాయతీ సర్పంచ్లకు, కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకుల కు ట్రైనింగ్ క్యాంపు నిర్వహిస్తున్నారని, కావున కాంగ్రెస్ శ్రేణులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని డి.సి.ఎం.ఎస్ మాజీ చైర్మన్,రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు కోరారు, సోమవారం కొత్తగూడెం విద్యానగర్ కాలనీ లోని పొంగులేటి క్యాంపు కార్యాలయంలో పాల్వంచ మండల, పట్టణ కాంగ్రెస్ పార్టీకి,చెందిన బి.ఎల్.ఎలు, సూపర్వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పి.సి.సి. సర్ ఇన్ఛార్జ్, కో–ఆర్డినేటర్ ఎం లింగోజీ, కొత్వాల ఓటర్ జాబితా సవరణ సర్ – 2 పై పలు సూచనలు చేశారు. అనంతరం బి.ఎల్.ఎల కు, సూపర్వైజర్ల కు కొత్త ఓటర్ లిస్ట్ లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ ఓటర్ నమోదులో సర్ ఫేజ్ – 2 కీలకమైనదని, బి.ఎల్.ఎలు కీలకంగా వ్యవహరించాలన్నారు. మంగళవారం జరిగే ప్రత్యేక ట్రైనింగ్ క్యాంప్ లో అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కొత్వాల పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చీకటి కార్తీక్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పెద్దబాబు, పాల్వంచ మండల కాంగ్రెస్ అధ్యక్షులు గంగిరెడ్డి భువనసుందర్ రెడ్డి, బి.ఎల్.ఎలు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.





# వీసంశెట్టి వెంకటేశ్వర్లు సేవలు చిరస్మరణీయం

- పాలకుల ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొడదాం.
- వేసంశెట్టి వెంకటేశ్వర్లు 50వ వర్ధంతి సభలో ఎమ్మెల్యే కూనం నేని




**కొత్తగూడెం కలెక్టరేట్, పాల్వంచ / ఆగస్టు 24,(ప్రజా జ్యోతి)** దివంగత వీసంశెట్టి వెంకటేశ్వర్లు సిపిఐ పార్టీకి, ప్రజలకు చేసిన సేవలు ఎప్పటికీ చిరస్మరణీయమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనం నేని సాంబశివరావు అన్నారు. పాల్వంచ మండలం నాగారం గ్రామంలో దివంగత వీసంశెట్టి వెంకటేశ్వర్లు స్మారక స్తూపం వద్ద సోమవారం ఆయన 50వ వర్ధంతి సభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు ఆయన చిత్రపటానికి, స్మారక స్తూపానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సంతాప సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు, ఈ ప్రాంతంలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణానికి, ఎర్ర జెండా విస్తరణకు వీసంశెట్టి వెంకటేశ్వర్లు తన జీవితాన్ని ధారపోశారని కొనియాడారు. పాల్వంచ, బూర్గంపాడు, ములకలపల్లి మండలాల్లో భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా భూమి, భుక్తి, వ్యవసాయ కూలీల సమస్యలపై రాజీలేని పోరాటాలు చేశారని గుర్తుచేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుల నాయకత్వంలో పనిచేసి అణగారిన వర్గాలకు కొండంత అండగా నిలిచారని , నాటి పోరాటాల స్ఫూర్తిని నేటి తరానికి అందించాల్సిన గురుతర బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా నేడు ప్రతి ఒక్కరు ముందుకు పోవాలని అన్నారు, పేదలకు విద్య, వైద్యం, ఉపాధి, భూమి దక్కేంతవరకు ఎర్ర జెండా అండతో ప్రజా ఉద్యమాలను ఉధృతం చేయడమే అమరులకు ఇచ్చే నిజమైన నివాళి అని స్పష్టం చేశారు. ఆయన కుటుంబం నేటికీ పార్టీలో నిబద్ధతతో కొనసాగడం గర్వకారణమన్నారు. సభ ప్రారంభం ముందు ప్రజా నాట్యమండలి కళాకారులు ఉద్యమ గేయాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వరరావు, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, రాష్ట్ర సమితి సభ్యులు నరాటి ప్రసాద్, సలిగంటి శ్రీనివాస్, చంద్ర నరేంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు, కార్పొరేటర్ అడుసుమిల్లి సాయిబాబా, వీసంశెట్టి పూర్ణచంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, చంద్రగిరి శ్రీనివాసరావు, వాసిరెడ్డి మురళి, ఫహీం, కందుల భాస్కర్, టీడీపీ రాష్ట నాయకులు కనగాల అనంతరములు, కార్పొరేటర్లు గుర్రం వెంకటేశ్వర్లు నామ కీర్తి, నూనావత్ శ్యామల, గొర్లె అన్నపూర్ణ, సర్పంచులు బానోతు రవి, సరస్వతి, బాధవత్ వినోద్, సీపీఐ జిల్లా సమితి సభ్యులు, కార్పొరేటర్ వీసంశెట్టి విశ్వేశ్వరరావు, డి సుధాకర్, వీ పద్మజ, వేముల కొండలరావు, అన్నారపు వెంకటేశ్వర్లు నిమ్మల రాంబాబు ఇట్టి వెంకట్రావు, శనగారపు శ్రీనివాసరావు, డి చెన్నయ్య, గుత్తుల సత్యనారాయణ, మన్నెం వెంకన్న, కాసర్ల రామారావు, SA రెహమాన్, అహ్మద్ జానీ, గౌతమి కృష్ణ, పల్లపు యాకయ్య, నామ పండు నూనావత్ దినేష్, గొర్లె నరేష్, కాకటి రవీందర్, ఆలపాటి ప్రసాద్ గాజులు సత్యనారాయణ, వాడే లక్ష్మి , వజ్జ రాజేశ్వరరావు, బిక్కులాల్, కృష్ణ, రామారావు, సంజీవరావు, అల్లి వెంకటేశ్వర్లు, వెంకన్న, చంచలపురి శ్రీను, ఇరుకులపాటి సుధాకర్, సాయుల శ్రీను, వెంకన్న, కొమరయ్య, బాదావత్ శ్రీను, భూక్యా విజయ వేములపల్లి రాజశేఖర్, వెంకటేశ్వర్లు సతీమణి సత్యవతి, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ విగ్రహం పునఃప్రతిష్ఠకు చర్యలు చేపట్టాలి

- జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్‌కు మాల జేఏసీ వినతి



**అశ్వాపురం, అగస్ట్ 24,ప్రజాజ్యోతి** అశ్వాపురం మండల కేంద్రంలో తొలగించిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేయాలని కోరుతూ మాల జేఏసీ నాయకులు జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. అంబేద్కర్ విగ్రహం తొలగింపు విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, తగిన చర్యలు చేపట్టేలా చూడాలని వారు విజ్ఞప్తి చేశారు.అంబేద్కర్ ఆశయాలు, రాజ్యాంగ విలువలను గౌరవిస్తూ విగ్రహాన్ని అదే ప్రాంతంలో పునఃప్రతిష్ఠించాలని నాయకులు కోరారు. ఈ అంశంపై సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హుస్సేన్ నాయక్‌కు తెలిపారు. కార్యక్రమంలో మాల జేఏసీ నాయకులు, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పాత్రికేయులు శేషగిరిరావును పరామర్శించిన ఎమ్మెల్యే జారే



**ములకలపల్లి, ఆగస్టు 24 (ప్రజాజ్యోతి):** మండల కేంద్రానికి చెందిన సీనియర్ పాత్రికేయులు, ములకలపల్లి ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షులు, మన తెలంగాణ రిపోర్టర్ అయితా శేషగిరిరావు అనారోగ్యంతో శస్త్రచికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సోమవారం ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా శేషగిరిరావు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జగన్నాథపురం సర్పంచ్ కుంజా వినోద్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎండీ జహీర్, జిల్లా ఉపాధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్ రావు, కొప్పుల రాంబాబు, గాడి తిరుపతిరెడ్డి, కారం సుధీర్, పేటేటి నరసింహారావు, సురభి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో వన మహోత్సవానికి ఏర్పాట్లు

- ఎంపీడీవో డి. రాజేశ్వరి మొక్కలు నాటేలా ఆదేశాలు
- ప్రభుత్వ కార్యాలయాలు, ఖాళీ స్థలాల్లో విస్తృతంగా మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు



**అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 24 (ప్రజా జ్యోతి)** :అన్నపురెడ్డిపల్లి మండలంలో మంగళవారం వన మహోత్సవ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించాలని ఎంపీడీవో డి. రాజేశ్వరి సూచించారు. రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న వన మహోత్సవంలో భాగంగా మండలంలో కార్యక్రమాన్ని చేపట్టాలని తెలిపారు. అన్ని గ్రామ పంచాయతీల పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని సూచించారు. ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేస్తూ కార్యక్రమాన్ని నిర్వహించాలని గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు.గ్రామ పంచాయతీ కార్యదర్శులు తమ సిబ్బందితో పాటు స్వచ్ఛంద సంస్థలు, ప్రజల సహకారంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల పరిధిలోని అనువైన ఖాళీ స్థలాలను కూడా మొక్కలు నాటేందుకు వినియోగించుకోవచ్చని సూచించారు. ప్రస్తుతం వర్షాలు సమృద్ధిగా కురుస్తుండటంతో మొక్కలు నాటేందుకు అనుకూలమైన వాతావరణం ఉందని పేర్కొన్నారు. నాటిన ప్రతి మొక్కను జాగ్రత్తగా సంరక్షించాలని, వాటికి అవసరమైన నీరు అందిస్తూ పెంచే బాధ్యతను తీసుకోవాలని తెలిపారు. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి పచ్చదనాన్ని పెంపొందించాలని ఎంపీడీవో డి. రాజేశ్వరి పిలుపునిచ్చారు.

# హాస్టళ్లు, ప్రభుత్వ ఆసుపత్రిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- ట్రైనీ డిప్యూటీ కలెక్టర్, తహసీల్దార్ ను కలిసి మద్దిశెట్టి సామేలు వినతి




**దమ్మపేట, ఆగస్టు 24(ప్రజా జ్యోతి):** దమ్మపేట మండల పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రితో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ బాలుర, బాలికల హాస్టళ్లను సందర్శించి వాటి పరిస్థితులు, స్థితిగతులపై విచారణ జరిపి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎన్సీపీ పార్టీ–ఎన్డీఏ మహాకూటమి ఎన్వైసీ తరఫున మద్దిశెట్టి సామేలు డిప్యూటీ కలెక్టర్, తహసీల్దార్ మద్దినేని మురళికి మెమొరాండం సమర్పించారు.ఈ సందర్భంగా మద్దిశెట్టి సామేలు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రి, సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు, ప్రజలకు అందుతున్న సౌకర్యాలను అధికారులు పరిశీలించాలని కోరారు. హాస్టళ్లలో విద్యార్థులకు అవసరమైన మౌలి క వసతులు, భోజనం, పారిశుద్ధ్యం, తాగునీరు తదితర అంశాలపై సమగ్రంగా విచారణ జరిపి సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.మెమొరాండంపై స్పందించిన డిప్యూటీ కలెక్టర్ మద్దినేని మురళి సంబంధిత అంశాలపై తప్పకుండా విచారణ జరిపించి, వాస్తవ పరిస్థితులను పరిశీలించిన అనంతరం తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎన్సీపీ పార్టీ–ఎన్డీఏ మహాకూటమి ఎన్వైసీ తెలంగాణ రాష్ట్ర జనరల్ సెక్రటరీ పలగాని శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆస్తి వివాదంలో దాడి.. నలుగురు కుమారులపై కేసు

**దమ్మపేట, ఆగస్టు 24(ప్రజాజ్యోతి):** మండలంలోని మందలపల్లి గ్రామం ప్రకాష్‌నగర్ కాలనీకి చెందిన నార్లపాటి వెంకటేశ్వరరావు తన నలుగురు కుమారులు తనపై దాడి చేశారని, అలాగే తన మరో కుమారుడు, కోడలిపై ఆస్తి వివాదానికి సంబంధించి దాడి చేశారని దమ్మపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బాధితుడి ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఆస్తి విషయంలో కుటుంబ సభ్యుల మధ్య కొంతకాలంగా వివాదం కొనసాగుతున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ క్రమంలో నలుగురు కుమారులు తనపై దాడికి పాల్పడటంతో పాటు, మరో కుమారుడు, కోడలిపై కూడా దాడి చేసినట్లు వెంకటేశ్వరరావు ఆరోపించారు. ఫిర్యాదు ఆధారంగా దమ్మపేట పోలీసులు కేసు నమోదు చేసి ఘటనకు సంబంధించిన వివరాలను సేకరిస్తున్నారు.

# ఈనెల 26న, ఖమ్మంలో పౌర హక్కుల సంఘం జిల్లా మహాసభ

- సి ఎల్ సి జిల్లా అధ్యక్షుడు సింగ్ ఉపేందర్



**కొత్తగూడెం కలెక్టరేట్ ,ఆగస్టు 24 ,(ప్రజా జ్యోతి)** ఈ నెల 26న,ఖమ్మంలో నిర్వహించనున్న పౌర హక్కుల సంఘం సి ఎల్ సి ఉమ్మడి జిల్లా 18వ, మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు సింగు ఉపేందర్ కోరారు, మహా సభలకు సంబంధించిన వాల్ పోస్టర్లను సోమవారం పాల్వంచలో సభ్యుల తో కలసి ఉపేందర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సభలను రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ గడ్డం లక్ష్మణ్ ప్రారంభిస్తారు అన్నారు, ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణ రావు, వక్తలుగా కె.రవి, పి.విప్లవకుమార్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు దుంద్ర రమేష్, సీతారామయ్య, గోలి సందీప్, నాగేందర్, ఎస్ కె పాష తదితరులు పాల్గొన్నారు.

# పేరు చూసి నమ్మవద్దు.. తెలియని ఫైల్ తెరవవద్దు..

- రహస్య సమాచారాన్ని ఎవరికీ చెప్పవద్దు"
- ఏపీకే ఫైళ్లతో సైబర్ మోసాలు
- తెలియని ఫైళ్లను తెరిస్తే వ్యక్తిగత సమాచారం, బ్యాంకు ఖాతాలకు ప్రమాదం
- దమ్మపేట ఎస్సై రాజేష్ కుమార్ హెచ్చరిక



**దమ్మపేట ఆగస్టు.24 (ప్రజాజ్యోతి):** ప్రభుత్వ పథకాలు, బ్యాంకులు, ఆధార్, పింఛన్లు, కేవైసీ, రుణాలు, ఉద్యోగ సమాచారం, ఆర్టీఓ చలాన్లు తదితర అంశాల పేరుతో వాట్సాప్, వ్యక్తిగత సందేశాల ద్వారా వచ్చే తెలియని ఏపీకే ఫైళ్ల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దమ్మపేట ఎస్సై రాజేష్ కుమార్ సూచించారు. సైబర్ నేరగాళ్లు ప్రభుత్వ శాఖలు, బ్యాంకుల పేర్లను ఉపయోగించి ప్రజలను నమ్మించి హానికరమైన ఏపీకే ఫైళ్లను పంపుతున్నారని, వాటిని తెరిచి ఫోన్ లో ఇన్స్టాల్ చేస్తే ఫోన్‌లోని కీలక సమాచారం సైబర్ నేరగాళ్లకు చేరే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

**ప్రభుత్వం పేరు ఉంటే నిజమని నమ్మొద్దు**

ఆధార్, ఎస్‌బీఐ, పీఎం కిసాన్, పీఎం ఆవాస్ యోజన, యూనియన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఈ–కేవైసీ, ఎల్ఐసీ, ఆయుష్మాన్ భారత్, ఆర్టీఓ చలాన్, ఆదాయపు పన్ను తదితర పేర్లతో వచ్చే ఏపీకే ఫైళ్లను చూసి అవి అధికారికమైనవని భావించవద్దన్నారు. ఫైల్ పేరు ఎంత నమ్మకంగా కనిపించినా, తెలియని వ్యక్తి పంపిన ఏపీకే ఫైలును తెరవకూడదని స్పష్టం చేశారు.

**ఒక్క క్లిక్.. భారీ నష్టానికి దారి**

ఏపీకే ఫైల్ ద్వారా హానికరమైన అనువర్తనం ఫోన్‌లోకి ప్రవేశిస్తే వ్యక్తిగత సమాచారం, సంక్షిప్త సందేశాలు, సంప్రదింపు నంబర్లు, బ్యాంకింగ్‌కు సంబంధించిన సమాచారం తదితర వివరాలు ప్రమాదంలో పడే అవకాశం ఉందని ఎస్సై తెలిపారు. ముఖ్యంగా ఒకసారి వినియోగించే సంకేతాలు, బ్యాంకు వివరాలు, యూపీఐ రహస్య సంఖ్య వంటి అత్యంత కీలక సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దన్నారు.

**ప్రజలు ఈ జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి**

– తెలియని ఏపీకే ఫైళ్లను తెరవకూడదు.
– అనుమానాస్పద ఫైళ్లను ఫోన్‌లో స్థాపించకూడదు.
– బ్యాంకు, కేవైసీ, రుణం, ప్రభుత్వ పథకం, చలాన్ పేరుతో వచ్చే ఫైళ్లను నమ్మకూడదు.
– అధికారిక ప్రభుత్వ వెబ్‌సైట్ లేదా అధికారిక అనువర్తన దుకాణం నుంచే అనువర్తనాలను పొందాలి.
– తెలియని లింకులపై క్లిక్ చేయకూడదు.
– ఒకసారి వినియోగించే సంకేతం, యూపీఐ రహస్య సంఖ్య, బ్యాంకు వివరాలను ఎవరికీ చెప్పకూడదు.
– పరిచయస్తుల పేరుతో ఫైల్ వచ్చినా ముందుగా వారికి ఫోన్ చేసి నిర్ధారించుకోవాలి.

**ఇప్పటికే ఏపీకే ఫైల్ ఇన్స్టాల్ అయి ఉంటే అప్రమత్తం కావాలి**

తెలియని ఏపీకే ఫైలును ఇప్పటికే స్థాపించినట్లయితే వెంటనే ఆ ఫైల్ ను తొలగించాలని ఎస్సై రాజేష్ కుమార్ సూచించారు. ఆ ఏపీకే ఫైల్ కు ఇచ్చిన అనుమతులను పరిశీలించి అవసరం లేనివాటిని రద్దు చేయాలన్నారు. బ్యాంకు ఖాతాల్లో అనుమానాస్పద లావాదేవీలు జరిగాయా అనేది వెంటనే పరిశీలించాలని, ఏదైనా అనుమానాస్పద లావాదేవీ గుర్తిస్తే ఆలస్యం చేయకుండా సంబంధిత బ్యాంకును సంప్రదించాలని తెలిపారు.

**సైబర్ మోసాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి**

"సైబర్ నేరగాళ్లు ప్రజల నమ్మకాన్ని ఆసరాగా చేసుకుని ప్రభుత్వ పథకాలు, బ్యాంకులు, కేవైసీ, రుణాలు వంటి పేర్లతో మోసాలకు పాల్పడుతున్నారు. తెలియని ఏపీకే ఫైలును తెరవడం ద్వారా మీ ఫోన్‌లోని వ్యక్తిగత సమాచారం, బ్యాంకింగ్ వివరాలు ప్రమాదంలో పడే అవకాశం ఉంది. అందువల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. అనుమానం కలిగించే ఫైళ్లు, లింకులకు దూరంగా ఉండాలి" అని దమ్మపేట ఎస్సై రాజేష్ కుమార్ సూచించారు. "పేరు చూసి నమ్మవద్దు.. తెలియని ఫైల్ తెరవవద్దు.. రహస్య సమాచారాన్ని ఎవరికీ చెప్పవద్దు" అని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండటమే సైబర్ మోసాలను అరికట్టేందుకు అత్యంత ముఖ్యమైన రక్షణ అని ఎస్సై తెలిపారు.



# న్యాయ పోరాటంలో విజయం.. ప్రజల మధ్యకు రేగా

- రాజకీయ కక్షసాధింపు కేసులకు భయపడేది లేదు
- ప్రజా సమస్యలపై ఇక మరింత ఉధృతంగా పోరాటం
- కల్యాణలక్ష్మి, షాదీముబారక్ నిధులు వెంటనే విడుదల చేయాలి
- పేదల పక్షాన బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుంది: రేగా కాంతారావు





**పినపాక,ఆగష్టు 24(ప్రజాజ్యోతి)** న్యాయపోరాటంలో విజయం సాధించి నియోజకవర్గానికి తిరిగి వచ్చిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావుకు నియోజకవర్గ ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఆయనపై నమోదైన కేసుల విషయంలో హైకోర్టులో న్యాయపరమైన ఊరట లభించడంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. ఈ సందర్భంగా పలుచోట్ల నాయకులు, కార్యకర్తలు రేగా కాంతారావును కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రేగా కాంతారావు మాట్లాడుతూ.. రాజకీయ కక్షసాధింపులతో ఎన్ని కేసులు పెట్టినా తాను భయపడేది లేదని స్పష్టం చేశారు. తనపై నమోదైన కేసు మొదటి నుంచీ రాజకీయ కుట్రలో భాగంగానే ఉందని తాను చెబుతూ వచ్చానని, న్యాయవ్యవస్థపై పూర్తి నమ్మకంతో న్యాయపోరాటం చేశానని తెలిపారు. చివరకు సత్యం, న్యాయం గెలిచాయని అన్నారు. ఒక మహిళను అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేయడం సమంజసం కాదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి విమర్శించారు. తనపై వచ్చిన ఆరోపణల కారణంగా తన కుటుంబం తీవ్ర మనస్తాపానికి గురైందని తెలిపారు. అయితే ప్రజల ఆశీర్వాదం, పార్టీ నాయకులు, కార్యకర్తలు అందించిన అండ తనకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. రాజకీయాల్లో ప్రత్యర్థిత్వం ఉండవచ్చని, కానీ వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసేలా తప్పుడు ఆరోపణలు, కేసులు పెట్టడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. ఇలాంటి చర్యలు తన ప్రజా పోరాటాన్ని ఏమాత్రం ఆపలేవని, ఇకపై మరింత పట్టుదలతో ప్రజా సమస్యలపై పోరాడుతానని ప్రకటించారు. హామీల అమలుపై ప్రభుత్వాన్ని నిలదీస్తాం కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని రేగా కాంతారావు ఆరోపించారు. ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలకు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం వాటి అమలుపై స్పష్టత ఇవ్వడం లేదన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం గుర్తుంచుకునేలా బీఆర్ఎస్ తరఫున నిరంతరం ప్రశ్నిస్తామని తెలిపారు. అవసరమైతే ధర్నాలు, నిరసనలు, ప్రజా ఉద్యమాలు చేపట్టి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని, అధికారంలో ఎవరు ఉన్నా ప్రజల తరఫున ప్రశ్నించడం, హక్కుల కోసం పోరాడటం కొనసాగుతుందని రేగా కాంతారావు స్పష్టం చేశారు. కల్యాణలక్ష్మి నిధులు విడుదల చేయాలి పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్న కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని రేగా కాంతారావు డిమాండ్ చేశారు.

పేదింటి ఆడబిడ్డల వివాహ సమయంలో కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించాలనే ఉద్దేశంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం కల్యాణలక్ష్మి పథకాన్ని అమలు చేసిందని తెలిపారు. పథకం ద్వారా ఎంతోమంది పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా లభించిందన్నారు. ప్రస్తుతం నిధుల విడుదలలో జాప్యం కారణంగా అర్హులైన లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వివాహాలు పూర్తయిన తర్వాత కూడా ఆర్థిక సాయం కోసం ఎదురుచూస్తున్న కుటుంబాలు ఉన్నాయని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించి అర్హులైన ప్రతి కుటుంబానికి నిధులు అందించాలని డిమాండ్ చేశారు. హైకోర్టు కేసుపై ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాలి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలుకు సంబంధించిన అంశం హైకోర్టు పరిధిలో పెండింగ్‌లో ఉన్నప్పటికీ ప్రభుత్వం ఈ విషయంలో తగిన విధంగా స్పందించకపోవడం వల్ల పేదలకు నష్టం జరుగుతోందని రేగా కాంతారావు అన్నారు. ప్రభుత్వం వెంటనే కౌంటర్ దాఖలు చేసి న్యాయపరమైన ప్రక్రియను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కోర్టు పరిధిలో ఉన్న అంశాన్ని త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. పేదల సంక్షేమానికి సంబంధించిన పథకాలను రాజకీయాలకు అతీతంగా అమలు చేయాలని సూచించారు. అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ పథకాల ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రజల కోసం పోరాటం మరింత ఉధృతం ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని రేగా కాంతారావు హెచ్చరించారు. ప్రజల తరఫున ప్రశ్నించే గొంతుకగా బీఆర్ఎస్ పార్టీ నిలుస్తుందని తెలిపారు. కల్యాణలక్ష్మి నిధుల విడుదల, ఎన్నికల హామీల అమలు, పేదల సమస్యల పరిష్కారం తదితర అంశాలపై ప్రభుత్వాన్ని నిరంతరం నిలదీస్తామని అన్నారు. అవసరమైతే ప్రజలను సమీకరించి మరింత పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని స్పష్టం చేశారు. న్యాయపోరాటంలో తనకు అండగా నిలిచిన నియోజకవర్గ ప్రజలకు, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు రేగా కాంతారావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఇకపై మరింత ఉత్సాహంతో ప్రజాసేవలో ముందుకు సాగుతానని చెప్పారు.

# ఉద్యోగుల జేఏసీ ఆందోళనలకు ఏఐవైఈఎఫ్ మద్దతు

**ములకలపల్లి ఆగస్టు 24 (ప్రజాజ్యోతి):** ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ఉద్యోగ జేఏసీ చేపట్టిన ఆందోళనలకు ఏఐవైఈఎఫ్ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఏఐవైఈఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ గరికె శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ నెల 27న జిల్లా కేంద్రాల్లో మహాధర్నా, అప్పటి నుంచి పీఆర్సీ ప్రకటించే వరకు నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరు, సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినం, సెప్టెంబర్ 10న చలో హైదరాబాద్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు, పీఆర్సీ ప్రకటన, ఆరు డీఏల విడుదల, ఈహెచ్ఎస్ సమర్థ అమలుతో పాటు పెండింగ్ బిల్లుల చెల్లింపునకు నెలకు రూ.2 వేల కోట్ల ప్యాకేజీ కొనసాగించాలని డిమాండ్ చేశారు.



# ప్రభుత్వ కళాశాలలో క్యాంపస్ సెలక్షన్స్

**చర్ల, ఆగస్టు 24 :(ప్రజా జ్యోతి):** చర్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 27వ తేదీ గురువారం ఉదయం 10 గంటల నుంచి టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ శ్రీ నరేందర్ తెలిపారు. టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ క్యాంపస్ సెలక్షన్స్‌కు పదో తరగతి, ఆపై ఉన్నత చదువులు పూర్తి చేసిన ఆసక్తిగల విద్యార్థులు హాజరు కావచ్చని తెలిపారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, మూడు సెట్ల జిరాక్స్ కాపీలు, మూడు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు వెంట తీసుకురావాలని సూచించారు. క్యాంపస్ సెలక్షన్స్‌లో ఎంపికైన అభ్యర్థులకు హైదరాబాద్‌లో మూడు నెలలపాటు ఉచిత శిక్షణ అందించడంతో పాటు, శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. శిక్షణ కాలంలో అభ్యర్థులకు భోజనం, వసతి సౌకర్యాలు కూడా కల్పిస్తారని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అధిక సంఖ్యలో క్యాంపస్ సెలక్షన్స్‌కు హాజరు కావాలని ప్రిన్సిపల్ నరేందర్ కోరారు.